17న సీఎం కప్-2024 టార్చ్ ర్యాలీ

సూర్యాపేట పట్టణం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి రేవంత్ ఆదేశానుసారం జిల్లాలో ఈనెల 17న సీఎం కప్-2024 టార్చ్‌ర్యాలీ నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి రాంచందర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాల నుంచి కర్నల్ సంతోష్‌బాబు చౌరస్తా వరకు ర్యాలీ చేపడుతున్నట్లు వెల్లడించారు. యాదాద్రి భువనగిరి నుంచి జిల్లాకు రానున్న ర్యాలీ బృందానికి పెద్ద ఎత్తున స్వాగతం పలకనున్నట్లు తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ, సీనియర్ క్రీడాకారులు, పీఈటీ సంఘ ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, యువజన సంఘాలు, క్రీడా సంఘాల ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

వరికి తాటాకు తెగులు

వానాకాలంలో సాగు చేసిన వరి పైరుకు తాటాకు తెగులు సోకి ఎర్రబారుతుండగా రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులు, అధిక ఉష్ణోగ్రతలు, అధిక వర్షపాతం వల్ల వరికి తాటాకు తెగులుతో కంకులు ఎర్రగా మారి తీవ్ర నష్టం వాటిల్లుతోందని రైతులు వాపోతున్నారు. ఎన్ని మందులు పిచికారీ చేసినా తెగులు అదుపులోకి రావడం లేదని, సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు క్షేత్ర స్థాయిలో పరిశీలించి, రైతులకు తగిన సలహాలు, సూచనలు ఇచ్చి పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు. వెంటనే తెగులు సోకిన పంట పొలాలను పరిశీలించి, నివారణ చర్యలపై రైతులకు సూచనలిస్తామని ఏవో ఆర్.దేవప్రసాద్ తెలిపారు. నడిగూడెం, న్యూస్‌టుడే:


రామాపురంలో తెగులు సోకి ఎర్రబారిన వరి పైరు

వారంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి


సూర్యాపేట: దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సూర్యాపేట కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలోని గ్రామాలు, మున్సిపాలిటీల్లో ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ బీఎస్.లతతో కలిసి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి మండలంలో సన్న, దొడ్డు రకం ధాన్యం కొనుగోలు కేంద్రాలను వారం రోజుల్లో ఒకటి, 15 రోజుల్లో అన్ని కేంద్రాలు ప్రారంభించాలని సూచించారు. పత్తి కొనుగోళ్లకు ఏడు మిల్లుల్లో కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని మిల్లర్లను ఆదేశించామన్నారు. అవకతవకలు జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. మండల ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తూ, కేంద్రాలు ఎక్కడ ఏర్పాటు చేయాలో ప్రణాళికలు సిద్ధం చేసి నివేదికలు అందించాలన్నారు.

సెలవుల అనంతరం పాఠశాలలు పునఃప్రారంభం అవుతున్న నేపథ్యంలో వసతి గృహాలు, పాఠశాలలు సిద్ధం చేయాలన్నారు. ప్రజావాణిలో 32 దరఖాస్తులు అందాయని పేర్కొన్నారు. డీఆర్డీవో అప్పారావు, డీపీవో నారాయణరెడ్డి, డీఎంహెచ్‌వో కోటా చలం, డీఈవో అశోక్, డీసీవో పద్మ, డీఏవో శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

గట్టికల్‌లో సంపూర్ణ మద్యపాన నిషేధం


గట్టికల్ గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట సమావేశమైన గ్రామస్థులు, పోలీసులు

ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: అక్టోబరు 2న గాంధీ జయంతి సందర్భంగా మండలంలోని గట్టికల్ గ్రామంలో మద్యపానం నిషేధించాలంటూ తీసుకొచ్చిన తీర్మానం సోమవారం నుంచి అమల్లోకి వచ్చింది. ఈ మేరకు గొలుసు దుకాణాలను స్వచ్ఛందంగా బంద్ చేశారు. మద్యం వల్ల కుటుంబాలు ఆగమవుతున్నాయని గాంధీ జయంతి రోజు ఊరంతా ఒక్కటైంది. ఈ పన్నెండు రోజుల్లో గొలుసు దుకాణాల వారికి గ్రామ పంచాయతీ తరపున నోటీసులు అందించారు. ఇక నుంచి మద్యం విక్రయించవద్దని సూచించారు. ఈ సందర్భంగా సోమవారం గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట గ్రామస్థులు, అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామంలో ఈ అంశంలో ఎవరైన వివాదాలు సృష్టిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని సమావేశంలో పాల్గొన్న ఏఎస్సై శంకర్ నాయక్ హెచ్చరించారు. మద్యం అమ్మినా, తాగినా రూ.25వేల జరిమానా విధిస్తామని మద్యనిషేధ కమిటీ పేర్కొంది. సమాచారం తెలిపిన వారికి రూ.2500 నజరానాగా ప్రకటించారు. గ్రామంలో మద్యపాన నిషేధం అమలుకు సహకరించిన వివిధ శాఖల అధికారులకు స్థానికులు ధన్యవాదాలు తెలిపారు.

వరి, పత్తి తడిసె.. రైతు కళ్లు చెమ్మగిల్లె


నూతనకల్‌లో వర్షానికి నేలవాలిన వరి చేను

నూతనకల్, న్యూస్‌టుడే: నూతనకల్, చిల్పకుంట్ల గ్రామాల్లో సోమవారం మధ్యాహ్నం ఒక్కసారిగా కురిసిన భారీ వర్షానికి చేతికొచ్చిన వరి పంటలు నేలవాలాయి. పత్తికాయలు పగిలి దూది తీయడానికి సిద్ధంగా ఉన్న సమయంలో అరగంటపాటు కురిసిన వానకు తడిసి చెట్టు నుంచి కింద రాలిపోయాయి. దీంతో ఇటు పత్తి, అటు వరి రైతుల ఆశలన్నీ అడియాశలయ్యాయి.

ఆత్మకూర్(ఎస్): మండలంలోని గట్టికల్, నెమ్మికల్, కందగట్ల గ్రామాల పరిధిలో సోమవారం వీచిన గాలివానకు కోత దశలో ఉన్న వరి పొలాలు నేలకొరిగాయి. గట్టికల్‌కు చెందిన పల్స వెంకన్నకు చెందిన వరి పొలం కోతదశలో ఉండగా ఒక్కసారిగా గాలులకు నేలవాలి, గింజలు రాలిపోయాయి. చివరి దశలో అకాల వర్షాలు, ఈదురుగాలులు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి.

నిద్రమత్తులో ప్రమాదం.. యువకుడి దుర్మరణం

మోతె, న్యూస్‌టుడే: అర్ధరాత్రి నిద్రమత్తు ముంచుకొచ్చి ద్విచక్ర వాహనం అదుపు తప్పి పైవంతెన గోడకు బలంగా ఢీకొనడంతో యువకుడు మృతి చెందిన ఘటన సూర్యాపేట-ఖమ్మం జాతీయ రహదారిపై హుస్సేనబాద్ వద్ద జరిగింది. ఎస్సై యాదవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చివ్వెంల మండలం సూర్యానాయక్‌తండాకు చెందిన జాటోత్ వీరన్న(21) ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ద్విచక్ర వాహనంపై వెళ్తూ ప్రమాదానికి గురై అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. స్వగ్రామం నుంచి ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలోని బంధువుల ఇంటికి తన ద్విచక్రవాహనంపై వెళుతుండగా నిద్రమత్తులోకి జారుకోవడంతో రహదారి పైవంతెన గోడకు బలంగా ఢీకొని రోడ్డుపై పడటంతో తల ఛిద్రమైంది. ప్రమాద ఘటన జాతీయ రహదారిపైనున్న సీసీ కెమెరాలో నిక్షిప్తమైంది. మృతుడి తండ్రి శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.


వీరన్న

పిడుగుపాటుకు మహిళ మృతి

నడిగూడెం, న్యూస్‌టుడే: అప్పటి వరకు పొలంలో పని చేశారు. మధ్యాహ్నం పక్కనే ఉన్న చెట్టు కింద కూర్చొని భోజనం చేస్తున్న సమయంలో ఉరుములు, మెరుపులతో చెట్టు పక్కనే పిడుగు పడి ఒక మహిళ మృతి చెందగా, మరొకరు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటన నడిగూడెం మండలం బృందావనపురం క్రాస్ రోడ్డు వద్ద సోమవారం జరిగింది. బృందావనపురం గ్రామానికి చెందిన మామిడి రమణ, పద్మ బంతి పూలు కోసేందుకు కూలి పనికి వచ్చారు. పిడుగు పడటంతో రమణ(24) అక్కడికక్కడే మృతి చెందగా, పద్మ అస్వస్థతకు గురయ్యారు. రోడ్డుపై వెళ్తున్న బాటసారులు గమనించి, 108కు సమాచారం ఇవ్వడంతో నడిగూడెంలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా రమణ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మెరుగైన వైద్య సేవల కోసం పద్మను కోదాడ ఆసుపత్రికి తరలించారు.


రమణ

ఆర్టీసీ ప్రత్యేక బాదుడు

○ అన్ని బస్సుల్లో 50 శాతం అదనపు వసూళ్లు


మిర్యాలగూడలో కోదాడ బస్సులో సీటు కోసం పోటీపడుతున్న ప్రయాణికులు

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే:

దసరా పర్వదినం సందర్భంగా ఆర్టీసీ సంస్థ ప్రయాణికుడి జేబుకు చిల్లులు పెడుతోంది. ప్రత్యేక(స్పెషల్) బస్సుల పేరిట అకస్మాత్తుగా ఛార్జీలు పెంచేసింది. పండగకు ముందు 25 శాతం అదనంగా వసూలు చేయడం ప్రారంభించింది. ఇక తిరుగు ప్రయాణంలో మరింత ముందడుగు వేసి ఏకంగా 50 శాతం అదనంగా వసూలు చేస్తోంది. నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లోని ఏడు డిపోల పరిధిలో హైదరాబాద్ సహా పలు ప్రాంతాలకు మొత్తం 646 ప్రత్యేక బస్సులు నడుస్తున్నాయి. అన్ని రూట్లలోనూ టికెట్ ధర పెంచి వసూలు చేస్తుండటంతో ప్రయాణికులు లబోదిబోమంటున్నారు.

పల్లెవెలుగు టిక్కెట్లు రద్దు

దసరా పండగకు వచ్చి తిరిగి వెళ్లే ప్రయాణికులతో ఉమ్మడి నల్గొండ జిల్లాలోని ఆర్టీసీ బస్టాండ్లు సోమవారం కిక్కిరిసిపోయాయి. ప్రయాణికుల రద్దీని చూసి ఇదే అదనుగా భావించిన సంస్థ యాజమాన్యం పల్లెవెలుగు బస్సుల్లోనూ ఎక్స్‌ప్రెస్ ఛార్జీలు వసూలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో అన్ని రూట్లలో పల్లెవెలుగు బస్సులన్నింటిలోనూ ఎక్స్‌ప్రెస్ ఛార్జీలు తీసుకుంటున్నారు. పండగ వేళ ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా చూసుకోవాల్సిన ఆర్టీసీ సంస్థ టికెట్ వెల పెంచడంపై సర్వత్రా తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. కొన్ని పల్లెవెలుగు బస్సులకు ఎక్స్‌ప్రెస్ బోర్డుతో పాటు ప్రత్యేకం బోర్డు పెట్టి మరింత అదనంగా దండుకుంటున్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.

సాధారణ ఛార్జీలు లేవు

బతుకమ్మ, దసరా పండగల సందర్భంగా ఈ నెల 2 నుంచి 16 వరకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతోంది. తొలుత సాధారణ ఛార్జీలు తీసుకుంది. ఆ తర్వాత 25 శాతం అదనంగా వసూలు చేయడం మొదలు పెట్టి ప్రస్తుతం 50 శాతం అదనంగా వసూలు చేస్తోంది. సాధారణ టిక్కెట్ ధరపై మరో సగం ఛార్జీ అదనంగా చెల్లించాల్సి వస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు. కేవలం ప్రత్యేక బస్సుల్లో మాత్రమే అదనపు ఛార్జీ వసూలు చేస్తున్నప్పటికీ.. అన్ని బస్సులకు ప్రత్యేకం బోర్డులు తగిలించారని.. సాధారణ బస్సులు అసలు నడపడం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ధరలు పెంచారిలా...

రూట్	బస్సు	సాధారణ ఛార్జీ (రూ.లలో)	ప్రత్యేక ఛార్జీ (రూ.లలో)
మిర్యాలగూడ–హైదరాబాద్	సూపర్‌లగ్జరీ	290	400
సూర్యాపేట– హైదరాబాద్	ఎక్స్‌ప్రెస్	200	290
నల్గొండ– హైదరాబాద్	డీలక్స్	180	260
కోదాడ–హైదరాబాద్	ఎక్స్‌ప్రెస్	290	410
మిర్యాలగూడ– హాలియా	పల్లెవెలుగు	30	50
నల్గొండ–మిర్యాలగూడ	పల్లెవెలుగు	60	110

(పల్లెవెలుగు బస్సుకు ఎక్స్‌ప్రెస్ పేరుతో సూపర్ లగ్జరీ ఛార్జీ వసూలు చేశారు)

ఉమ్మడి జిల్లాలో డిపోల వారీగా ప్రత్యేక బస్సుల వివరాలు..

డిపో	ప్రత్యేక బస్సులు	తిరుగు ప్రయాణంలో
నల్గొండ	74	30
యాదగిరిగుట్ట	59	32
నార్కట్‌పల్లి	37	12
దేవరకొండ	62	32
మిర్యాలగూడ	84	34
కోదాడ	45	14
సూర్యాపేట	87	37



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే..

– రాజశేఖర్, ఆర్టీసీ ఆర్‌ఎం, నల్గొండ

దసరా సందర్భంగా నడుపుతున్న ప్రత్యేక బస్సులు తిరుగు ప్రయాణంలో ఖాళీగా వస్తున్నాయి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేక బస్సుల్లో 50 శాతం అదనపు ఛార్జీలు వసూలు చేస్తున్నాం. పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అందుబాటులో ఉంది.

సమగ్ర కులగణనకు కసరత్తు

ఈనాడు, నల్గొండ:


ఒకట్రెండు రోజుల్లో మార్గదర్శకాలు

సమగ్ర కులగణన చేపట్టేందుకు నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లాల అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో ఒకట్రెండు రోజుల్లో మార్గదర్శకాలు వెలువడనున్నాయని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో జరిగే ఈ భారీ క్రతువును రెండు నెలల్లో పూర్తి చేయాలని సర్కారు భావిస్తోంది. ఈ దిశగా మూడు జిల్లాల ఉన్నతాధికారులు క్షేత్రస్థాయి సిబ్బందిని కార్యోన్ముఖులను చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ సమయంలో గత భారాస ప్రభుత్వం 2014లో సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించింది. జనాభా దామాషా ప్రకారం ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్లు ఉండాలని గత కొన్నాళ్ల నుంచి బీసీ, ఎస్సీ, ఎస్టీ సంఘాలు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో పదేళ్ల అనంతరం మరోసారి సమగ్ర కులగణన చేపట్టనుండటం విశేషం.

సమగ్ర వివరాల సేకరణ

కులగణనలో క్షేత్రస్థాయి సిబ్బంది ప్రతి కుటుంబం కులంతో పాటు వారి ఆర్థిక, సామాజిక, రాజకీయ స్థితిగతులు, విద్యా, ఉద్యోగం తదితర పరిస్థితులను సేకరించనున్నారు. వీటన్నింటినీ క్రోడీకరించి సమగ్ర నివేదికను జిల్లాల వారీగా ప్రభుత్వానికి నివేదించనున్నారు. బీసీల్లోని ఉపకులాలను సైతం ఈ సర్వేలో పొందుపరచనున్నారు. దీని ద్వారానే రానున్న పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్లు, స్థానిక సంస్థల్లో బీసీల కోటాను నిర్ధారించనున్నారు.

పదేళ్ల క్రితం ఉమ్మడి జిల్లాలో సమగ్ర కుటుంబ సర్వేలో కులాల వారీగా జనాభా వివరాలు

మొత్తం జనాభా :	35,99,237
ఎస్సీ :	6,98,894
ఎస్టీ :	4,30,956
బీసీ :	19,47,459
ఓసీ :	5,21,928
మైనార్టీ :	2,29,662

రాజకీయ అవకాశాలు లభిస్తాయని..

◆ ప్రస్తుతం మూడు జిల్లాల్లోనూ మొత్తం జనాభాలో సుమారు 52 శాతం బీసీ జనాభా ఉంది. ఉమ్మడి జిల్లాలో అనాదిగా ఆధిపత్య వర్గాల అండ లేకపోవడంతో బీసీలకు రాజకీయంగా సరైన ప్రాధాన్యం దక్కడం లేదని ఏళ్ల నుంచి ఆయా సంఘాలు విమర్శిస్తున్నాయి. ఈ సర్వే ద్వారా బీసీ లెక్క తేలితే దాని ఆధారంగా రాజకీయ అవకాశాలు లభిస్తాయని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

◆ నోడల్ ఏజెన్సీగా ఉన్న ప్రణాళిక శాఖలో తగినంత సిబ్బంది లేకపోవడంతో ఈ సర్వే జరిగే రెండు నెలల పాటు ఇతర శాఖల నుంచి పలువురిని డిప్యుటేషన్ మీద తీసుకోనున్నట్లు తెలిసింది. సర్కారు నుంచి మార్గదర్శకాలు విడుదలైన వెంటనే క్షేత్రస్థాయిలో పని మొదలుపెట్టాలని ఇప్పటికే ఉన్నతాధికారులకు ఆదేశాలు అందాయి. ఈ నేపథ్యంలో ఒకట్రెండు రోజుల్లో దీనిపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఉన్నతాధికారులు దిశానిర్దేశం చేయనున్నట్లు సమాచారం.

కొందరిపైనే పని భారం!

❑ జిల్లాలో సెలవు పెట్టిన 62 మంది పంచాయతీ కార్యదర్శులు

సూర్యాపేట కలెక్టరేట్, న్యూస్‌టుడే:



జిల్లాలో గ్రామ పంచాయతీల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. ఇప్పటికే సర్పంచుల పదవీ కాలం ముగిసింది. దీనికితోడు ఆగస్టులో పంచాయతీ కార్యదర్శుల బదిలీలు జరిగాయి. కొత్తవారికి ఆయా పంచాయతీలపై అవగాహన లేదు. ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతున్నా.. పంచాయతీల పరిస్థితి అస్తవ్యస్తంగా తయారైంది. కొన్ని గ్రామాలకు ఇన్‌ఛార్జి కార్యదర్శులు బాధ్యత వహిస్తున్నారు. వాటిల్లో పారిశుద్ధ్య, ఇతర సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఇన్‌ఛార్జిల పాలన..

జిల్లా వ్యాప్తంగా 475 గ్రామ పంచాయతీలున్నాయి. అన్నింటిలోనూ కార్యదర్శులు విధులు నిర్వర్తిస్తున్నారు. ఇటీవల జరిగిన బదిలీల్లో 180 మంది స్థానచలనం కలిగింది. బదిలీల సమయంలో కొన్ని గ్రామ పంచాయతీలు ఎంపిక చేసుకునేందుకు అవకాశం కల్పించకపోవడంతో ఈ విషయమై అప్పుడే జిల్లా పాలనాధికారి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే పరిష్కరించారు. అప్పటికే జూనియర్ పంచాయతీ కార్యదర్శులు పంచాయతీలను ఎంపిక చేసుకున్నారు. కొందరికి ఆయా గ్రామాలకు వెళ్లేందుకు ఇష్టం లేదు. కొందరు అనారోగ్యం, ఇతర ఉద్యోగాలకు సిద్ధమయ్యేందుకు, ఇలా వివిధ కారణాలతో జిల్లాలో 62 మంది కార్యదర్శులు సెలవుపై వెళ్లారు. దీంతో పని చేస్తున్న వారిపైనే భారం పడుతోంది. అందులో దాదాపు 20 మంది వరకు పని చేసేందుకు ఆసక్తి ఉందని, ఆ స్థానం నుంచి వేరే ప్రాంతానికి బదిలీ చేస్తే వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపినట్లు సమాచారం. అధికారులు స్పందించి బదిలీ చేస్తే పని ఒత్తిడి తగ్గుతుంది.

జిల్లాలో పంచాయతీ కార్యదర్శుల వివరాలు

మొత్తం కార్యదర్శులు :	475
ఓపీఎస్‌లు :	51
గ్రేడ్-2 :	288
జేపీఎస్ :	136
సెలవుల్లో ఉన్న వారు:	62
బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్న వారు :	24

పాలనాధికారి చెప్పినా!

పంచాయతీల్లో సెలవుల్లో ఉన్న ఉద్యోగుల వివరాలపై జిల్లా పాలనాధికారి ఇప్పటికే ఆరా తీసినట్లు సమాచారం. బదిలీలు అవసరమున్న వారికి వారు కోరుకునే స్థానాలకు వెళ్లేందుకు సుముఖంగా ఉన్న వారిని బదిలీ చేసేలా సన్నాహాలు చేయాలని సంబంధిత శాఖ అధికారికి నెల క్రితమే తెలియజేసినట్లు తెలిసింది. సదరు అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఉన్నతాధికారులకు నివేదిస్తాం

– నారాయణరెడ్డి, డీపీవో, సూర్యాపేట

జిల్లాలో వివిధ కారణాలతో కార్యదర్శులు సెలవు పెట్టిన విషయం వాస్తవమే. కొందరు ఆయా గ్రామాలకు వెళ్లేందుకు సుముఖంగా లేని వారి వివరాలు తెలుసుకున్నాం. వారి బదిలీ విషయమై ఉన్నతాధికారులకు నివేదిస్తాం.


నాలుగు కొత్త పోలింగ్ కేంద్రాలకు ప్రతిపాదనలు


సూర్యాపేట: రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమైన అదనపు కలెక్టర్ బీఎస్.లత

సూర్యాపేట కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో జనవరి 1, 2025 నాటికి 18 ఏళ్ల వయస్సు నిండిన వారు నూతన ఓటుకు దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ బీఎస్.లత సూచించారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, మార్పులు, చేర్పులపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో నాలుగు నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు రాజకీయ నాయకులు సూచన మేరకు ప్రతిపాదనలు పంపుతున్నామని తెలిపారు. తుంగతుర్తిలో ఒకటి, హుజూర్‌నగర్‌లో మూడు కొత్త కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్డీవోలు శ్రీనివాస్, వేణుమాధవ్, ఎన్నికల సూపరింటెండెంట్ శ్రీనివాస రాజు, తహసీల్దార్లు శ్యాం ప్రసాద్, వాజీద్, నాగేందర్, దయానందం, నాయకులు చకిలం రాజేశ్వర్‌రావు, సత్యనారాయణ, హబీద్, స్టాలిన్, రమేశ్ పాల్గొన్నారు.

రైతేరాజు 6లో..

కొత్త ఉపాధ్యాయులు వస్తున్నారు..!



నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే:

సర్కారు బడులకు కొత్త ఉపాధ్యాయులు వచ్చి పాఠం చెప్పనున్నారు. డీఎస్సీ-2024 ద్వారా ఉపాధ్యాయ కొలువులకు ఎంపికైన అభ్యర్థులకు మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఇప్పటికే హైదరాబాద్‌లో ఉత్తర్వులు అందుకున్న అభ్యర్థులకు కౌన్సెలింగ్ ద్వారా పాఠశాల కేటాయించనున్నారు. కొత్త వారి రాక సర్కారు బడుల్లో కొంత మేర ఉపాధ్యాయుల కొరత తీరనుంది. నల్గొండ జిల్లాలో 605, సూర్యాపేట జిల్లాలో 386, యాదాద్రి భువనగిరి జిల్లాలో 277 ఖాళీలను భర్తీ చేయడానికి నోటిఫికేషన్ జారీచేసింది. ఫలితాలు వెలువడిన తర్వాత ధ్రువపత్రాలు పరిశీలించి 1:1 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేశారు. వీరికి హైదరాబాద్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. దసరాకు ముందు కొలువుల ఉత్తర్వులు పొందినా ఎక్కడ పోస్టింగ్ అనే విషయం కొలిక్కిరాలేదు. పోస్టింగ్ కోసం జిల్లా విద్యాశాఖ మంగళవారం ప్రత్యేకంగా కౌన్సెలింగ్ నిర్వహించనుంది.

ప్రాథమిక పాఠశాలలకు ఊరట

ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక పాఠశాలలకు కాస్త ఊరట కలగనుంది. ఇటీవల పదోన్నతులు, బదిలీలు చేపట్టిన తరువాత ప్రాథమిక పాఠశాలల్లో ఎస్జీటీల కొరత కాస్త ఎక్కువగా ఉంది. బదిలీ జరిగిందని సంతోషం ఉన్నా అక్కడ ఉపాధ్యాయులు లేక కొన్నిచోట్ల రిలీవర్‌లు లేక అదే స్థానంలో కొనసాగుతున్నారు. తాజాగా కొత్త ఉపాధ్యాయుల నియామకం అవుతుండటంతో అలాంటి వారికి కాస్త ఉపశమనం కలుగనుంది.

ఉదయం ఎస్‌ఏలు, మధ్యాహ్నం ఎస్జీటీలకు..

– అశోక్, డీఈవో, సూర్యాపేట

జిల్లాలో డీఎస్సీ-2024 స్కూల్ అసిస్టెంట్(ఎస్‌ఏ), సెకండరీ గ్రేడ్ టీచర్స్(ఎస్జీటీ) పోస్టులకు ఎంపికై నియామక పత్రం తీసుకున్న అభ్యర్థులు మంగళవారం పోస్టింగ్ ఉత్తర్వులు ఇస్తాం. స్కూల్ అసిస్టెంట్లు, భాషా పండితులు ఉదయం పది గంటలకు నిర్వహించే కౌన్సెలింగ్ హాజరు కావాలి. ఎస్జీటీలకు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి కౌన్సెలింగ్ నిర్వహిస్తాం. సీనియార్టీ ప్రకారం పాఠశాలలను కేటాయిస్తూ ఉత్తర్వులను జారీ చేస్తాం. అభ్యర్థులందరూ ఒరిజినల్ ధ్రువపత్రాలతో కలెక్టరేట్‌లో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలి.

టీకా వేసి.. రోగం నయం చేసి

❑ నేటి నుంచి పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణ చర్యలు


భానుపురి, న్యూస్‌టుడే: పశువుల్లో గాలికుంటు వ్యాధి చాలా ప్రమాదకరం. ఇది సూక్ష్మ క్రిములతోపాటు కలుషిత నీరు, ఆహారం, వాయు కాలుష్యం ద్వారా వ్యాపిస్తుంది. ఈ వ్యాధి నివారణ కోసం పశువులకు టీకాలు పంపిణీ చేయనున్నారు. మంగళవారం నుంచి నవంబర్ 14 వరకు జిల్లా వ్యాప్తంగా జిల్లా పశువైద్యశాఖ ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టనున్నారు. టీకాలు వేసిన వెంటనే ప్రతి పశువుకు చెవి పోగు వేస్తారు. ఆ నెంబరుని ప్రత్యేకమైన యాప్‌లో నమోదు చేస్తారు. ఈ ఏడాది జిల్లాలో 1,86,000 పశువులకు 46 బృందాలుగా వైద్యసిబ్బంది ఏర్పడి టీకాలు వేయనున్నారు.

వ్యాధి లక్షణాలు.. ప్రభావం

ఈ వ్యాధి సోకిన పశువుల్లో మూతి, కాళ్లలో పుండ్లు ఏర్పడతాయి. నోటి నుంచి చొంగ కారుతుంది. ఆకలి మందగిస్తుంది. నీరసంగా ఉంటుంది. పాడి పశువుల్లో పాల దిగుబడి తగ్గిపోతుంది. చికిత్సకు ఖర్చు కూడా ఎక్కువగా ఉంటుంది. పాలు, మాంసం నాణ్యత గణనీయంగా తగ్గిపోతుంది. ఎగుమతులపై ప్రభావం చూపుతుంది. ఈ సమస్యను గుర్తించిన ప్రభుత్వం జాతీయ పశువ్యాధుల నివారణ పథకం కింద దేశంలో ఉచితంగా గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేసేందుకు శ్రీకారం చుట్టింది.

రైతులు తప్పక వేయించాలి

– దామచర్ల శ్రీనివాసరావు, జిల్లా పశువైద్యాధికారి, సూర్యాపేట



వర్షాకాలం కావడంతో పశువులకు గాలికుంటు వ్యాధి వచ్చే అవకాశం ఉంది. గ్రామాల్లో సిబ్బందికి సహకరించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి. రైతులు ఈ విషయంలో నిర్లక్ష్యం వహించకుండా తప్పకుండా పశువులకు టీకాలు వేయించాలి.

పత్తిలో గులాబీ రంగు లక్షణాలు, నివారణ

త్రిపురారం, న్యూస్‌టుడే: పత్తిలో గులాబీ రంగు లక్షణాలు, నివారణ గురించి కంపసాగర్ కేవీకే పీసీ శ్రీనివాసరావు తెలియజేశారు. తల్లి పురుగు లేత ఆకుల అడుగు



భాగాన లేత కొమ్మలు పూమొగ్గలు, లేత కాయలు, రక్షక పత్రాల పైన గుడ్లను గుంపులుగా, విడివిడిగా పెడుతుంది. గుడ్ల నుంచి బయటికి వచ్చిన కంటికి కనిపించని చిన్న లార్వాలు పూమొగ్గలలోకి తొలుచుకుని పువ్వు లోపలి పదార్థాలను తిని వీటిని గుడ్డి పూలుగా మారుస్తాయి. చిన్న లార్వాలు కాయలపై కన్పించనంత చిన్న రంధ్రాలు చేసి లోపలికి ప్రవేశిస్తాయి. తరువాత కాయలకు చేసిన రంధ్రం పూడిపోయి పురుగు కాయలోనే ఉండి గింజలను తింటూ దూదిని బాగా నష్టపరుస్తుంది. దూది రంగు, నాణ్యత పూర్తిగా దెబ్బతింటుంది. పురుగు లార్వా దశ మొత్తం కాయలోనే గడపటంతో కాయ పగిలిన తరువాత మాత్రమే నష్టాన్ని గుర్తించగలం. పురుగు ఆశించిన కాయలు పూర్తిగా వృద్ధి చెందక త్వరగా పక్వానికి వస్తాయి. గులాబీ రంగు పురుగు వల్ల జరిగే నష్టం పైకి కనపడదు. కాయలు పగిలినప్పుడు మాత్రమే తెలుస్తుంది. ఎందుకంటే గుడ్ల నుంచి వెలువడిన వెంటనే చిన్న లార్వాలు మొగ్గలపైన, కాయల పైన కంటికి కనిపించని సన్నని రంధ్రాలను చేస్తుంది. దీని నివారణకు సమగ్ర యాజమాన్య పద్ధతులను అనుసరించాలని ఆయన తెలిపారు.

నాటు కోళ్ల పెంపకం.. లాభదాయకం

రైతేరాజు

చండూరు, న్యూస్‌టుడే: కుటుంబ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా పదో తరగతిలోనే చదువు మానేసి తన సొంత కాళ్లపై తాను నిలబడాలని ఉన్న ఊరిలో తన సొంత భూమిలో వ్యవసాయంతో పాటు నాటు కోళ్ల పెంపకం చేపడుతూ స్వయం ఉపాధి పొందుతూ చుట్టు పక్కల వారికి ఆదర్శంగా నిలుస్తున్నాడు చండూరు మండలం పడమటితాళ్ల గ్రామానికి చెందిన జిల్లా రాజీవ్. ఏడేళ్ల పాటు ఆటోమొబైల్ దుకాణం నడిపించి. పోటీ ప్రపంచంలో దుకాణం నిర్వహించడం కష్టంగా భావించి వ్యవసాయ అనుబంధ రంగాలలో రాణిస్తున్న అనుభవజ్ఞుల సలహాలు, సూచనల మేరకు నాటు కోళ్ల పెంపకం చేపడుతూ అధిక లాభాలు గడిస్తున్న రాజీవ్ తన అనుభవాన్ని తెలియపరిచారిలా..



నాటు కోళ్లకు దాణా వేస్తున్న రాజీవ్

రూ.5 లక్షలతో షెడ్డు నిర్మాణం..

నాలుగెకరాల వ్యవసాయ భూమిలో మూడెకరాలు పత్తి సాగు, మరో ఎకరంలో నాటు కోళ్లను పెంచేందుకు రూ.5లక్షల వ్యయంతో చుట్టూ రాతి కడీలు అమర్చి కంచె లోపల వెయ్యి నాటు కోళ్ల సామర్థ్యం కలిగిన షెడ్డును ఏర్పాటు చేశాను. భద్రత దృష్ట్యా సీసీ కెమెరాలను అమర్చి గుర్తు తెలియని వ్యక్తులు షెడ్డు పరిసర ప్రాంతాలకు వస్తే సైరన్ వచ్చే విధంగా ఏర్పాటు చేసుకున్నాను. కల్వకుర్తి నుంచి అసిలి జాతికి చెందిన ఒక్క రోజు నాటు కోడి పిల్లలను ఒక్కోటి రూ.45 చొప్పున కొనుగోలు చేసి నాలుగు నెలల పాటు వాటిని పెంచుతూ ఒక్కో కోడి రెండు కిలోల బరువు కాగానే చుట్టు పక్కల గ్రామాల వారికి కిలోకి రూ.350 నుంచి రూ.400 వరకు విక్రయిస్తున్నాను. పెట్టుబడిగా ఒక్క కోడిపిల్లకు, దాణాకు కలిపి రూ.160 ఖర్చవుతుంది.

ఆరు నెలల్లో వెయ్యి కోళ్లను విక్రయించా..

నాటు కోళ్లకు డిమాండ్ బాగుండటంతో ఆరు నెలల్లోనే వెయ్యి నాటుకోళ్లను పూర్తిగా విక్రయించాను. ఈ కారణం దృష్ట్యానే షెడ్డు సామర్థ్యాన్ని పెంచి ప్రతి రోజు వినియోగదారులకి కోళ్లు అందుబాటులో ఉండే విధంగా ప్రణాళిక ఏర్పాటు చేసుకుని బ్యాంక్ రుణం కోసం అర్జీ పెట్టుకున్నాను. రుణం మంజూరు కాగానే షెడ్డుని విస్తరించి కోళ్ల పెంపకాన్ని చేపడతాను. ఇప్పటికే విక్రయించిన తొలి బ్యాచ్‌తోనే షెడ్డు నిర్మాణానికి ఖర్చు చేసిన డబ్బులు సమకూరటంతో పాటు సుమారు రూ.60వేల వరకు లాభం వచ్చింది.

వెదజల్లె పద్ధతిలో వరిలో కలుపు నివారణ



త్రిపురారం, న్యూస్‌టుడే: వరిలో వెదజల్లె పద్ధతిలో వెడల్పాకు కలుపు నివారణకు నాటిన 25, 30 రోజులకు 2.4-డి సోడియం సాల్ట్‌ను ఎకరాకు 500, 600గ్రా 2.4 డి 125-1.50 లీటర్లను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. గడ్డి జాతి, వెడల్పాకు కలుపు నివారణకు బిస్‌పైరిఫాస్ సోడియాన్ని ఎకరాకు 100 మీ.లీ. అనగా లీటరు నీటికి 0.5 మీ.లీ. మందును లీటరు నీటికి కలిపి 15, 20 రోజుల మధ్య పిచికారీ చేసుకోవాలి. వరి వెదజల్లె ముందు పొలంలో తుంగ, గరిక, దర్భగడ్డి, బొంత, ఊద వంటి మొండి జాతి కలుపు మొక్కలు ఎక్కువగా ఉన్నప్పుడు తొలకరి వర్షాలు పడి, కలుపు ఏపుగా పెరుగుతున్నప్పుడు లీటరు నీటికి 5 మీ.లీ. పాక్టాట్ 24 శాతం రసాయనాన్ని, గ్లైపోసినేట్ 13.5 శాతం ద్రావకం 4 మీ.లీ.లను ఒక లీటరు నీటికి కలిపి ఎక్కడ కలుపు ఉంటే అక్కడ పిచికారీ చేయాలి. ఈ మందు స్ప్రే చేసిన 10, 15 రోజుల తరువాత వరి వెదజల్లుకోవచ్చు. వెదజల్లిన 1, 2 రోజుల లోపు తేమ ఉన్నప్పుడు ఎకరాకు లీటరు పెండిమిథాలిన్ 30 శాతం (స్టాంప్, పెండిస్టార్) 700 మీ.లీ. పెండిమిథాలిన్ 38.7 శాతం ద్రావకం, 400 మీ.లీ. ప్రెటిలాక్లోర్ 50 శాతం (రిఫిట్, ఎరేజ్) 200 లీటర్ల నీటిలో కలిపి స్ప్రే చేయాలి. ఈ విధంగా వరిలో వెదజల్లె పద్ధతిలో కలుపు నివారించవచ్చు.

సమస్య - సమాధానం

? వేరుసెనగలో విత్తన శుద్ధి గురించి తెలపండి.
– రామయ్య, నల్గొండ

సమాధానం: కిలో విత్తనానికి 1గ్రా. టెబ్యుకొనజోల్, 3గ్రా. మాంకోజెట్ పొడి మందును పట్టించాలి. కాయ కుళ్లు వైరస్ తెగులు ఆశించే ప్రాంతాల్లో ఒక మి.లీ. ఇమిడాకోల్పిడ్ 600 ఎఫ్‌ఎస్‌ను 2 మీ.లీ. నీటిలో కలిపి ఒక కిలో విత్తనానికి పట్టించి విత్తనశుద్ధి చేసుకోవాలి.

? పత్తిలో పచ్చదోమ లక్షణాలు, నివారణ గురించి తెలపండి.
– వెంకటేశ్వర్లు, హాలియా

సమాధానం: పత్తిలో పచ్చదోమ లక్షణాలు పిల్ల, తల్లి పురుగులు ఆకు అడుగు భాగాన చేరి ఆకుల నుంచి రసాన్ని పీల్చుతాయి. ఆకులు మొదట దోనెలుగా ముడుచుకుని లేత పసుపు రంగులోకి మారి ఆ తరువాత ఆకుల అంచుల నుంచి ఎర్రబడి క్రమేపి ఎండి రాలిపోతాయి. దీని నివారణకు కాండానికి మందు పూసే పద్ధతిని పాటించాలి. 30, 45 రోజులల్లో మోనోక్రోటోఫాస్‌ను 1:4 నిష్పత్తిలో, 60 రోజుల వయసులో ఇమిడాక్లోప్రిడ్ నీరు 1:20 నిష్పత్తిలో పూయాలి.

? వరిలో యాసంగి రకాలు తెలపండి.
– సైదయ్య, తిప్పర్తి

సమాధానం: శీతల (డబ్ల్యుజీఎల్ 283) సన్న పొడువు బియ్యం గింజ రకం ఎర్రమల్లెలు (డబ్ల్యుజీయల్ 20471) తల్లికోడు నీటి ఎద్దడిని తట్టుకుంటుంది. (జేజీఎల్ 17004) ఉల్లికోడు అగ్గి తెగులును తట్టుకుంటుంది. (ఎన్‌ఎల్‌ఆర్ 34499) అగ్గి తెగులును సమర్థంగా తట్టుకుంటుంది. ఇది సన్న గింజ రకం.
- (త్రిపురారం, న్యూస్‌టుడే

రైతులు వాట్సప్ ద్వారా అడిగే సమస్యలకు, సందేహాలకు కంపసాగర్ కేవీకే ఉద్యాన విభాగం శాస్త్రవేత్త శ్రీనివాసరావు సమాధానాలు ఇస్తారు. ఫోన్ నంబర్: 77025 44771



కంపసాగర్ కేవీకే పీసీ శ్రీనివాసరావు

ఆదరిస్తే.. ప్రగతి కాంతలు..!

★ నేడు 'అంతర్జాతీయ గ్రామీణ మహిళా దినోత్సవం'

పట్టు గొమ్మల్లాంటి పల్లెల్లో నివసిస్తున్న మహిళలు వ్యవసాయంలో రాణిస్తూ.. దేశాభివృద్ధికి తమ వంతు కృషిచేస్తున్నారు. స్థానిక వనరులను వినియోగించుకొన్న కొందరు ఆర్థికంగా, సామాజికంగా అభ్యున్నతి సాధిస్తున్నారు. సమాజంలో వేళ్లూనుకుపోయిన మూఢ నమ్మకాలు, నిరక్షరాస్యత కారణంగా చాలా మంది గ్రామీణ మగువలు ఇంకా వెనుకబడే ఉన్నారు. వారి కోసం ప్రభుత్వాలు అనేక పథకాలు, కార్యక్రమాలు అమలుపరిస్తే పల్లెఖ్యాతి విస్తరిస్తుంది. గ్రామాల్లో అభివృద్ధి కాంతులు వెల్లివిరుస్తాయి. పల్లెటూరి అతివల సాధికారతకు ఏటా అక్టోబరు 15న నిర్వహిస్తున్న 'అంతర్జాతీయ గ్రామీణ మహిళా దినోత్సవం' సందర్భంగా 'న్యూస్‌టుడే' కథనం

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే:

చట్టసభల్లో సగమెప్పుడో..?

రాజకీయంగా చైతన్యం తీసుకొస్తే గ్రామీణ మహిళలు అభ్యున్నతి సాధిస్తారు. అందుకే ప్రభుత్వాలు స్థానిక సంస్థ ఎన్నికల్లో రాజకీయంగా మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించింది. కీలక నిర్ణయాలు తీసుకునే సమావేశాల్లో మహిళా ప్రతినిధులకు బదులుగా వారి భర్తలు, కుమారులు పెత్తనం చెలాయిస్తుండటంతో



అనుకున్న లక్ష్యం నెరవేరడంలేదు. దీంతో గ్రామాలను దాటి చట్టసభలకు అడుగు పెట్టే మహిళలు కరవయ్యారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 12 నియోజకవర్గాలు ఉండగా.. కేవలం ఒక్కరే మహిళా ఎమ్మెల్యే ఉండటం అందుకు నిదర్శనం.

పరిశ్రమలు వికసిస్తే..

మహిళల ఆర్థికాభ్యున్నతికి ప్రభుత్వం సమభావన సంఘాల ఏర్పాటు చేసి రుణాలు మంజూరు చేస్తోంది. ఆ రుణాలను సద్వినియోగం చేసుకున్న అతివలు కుట్టు, మగ్గం పని, బ్యూటీపార్లర్, పాల సేకరణ, కిరాణ దుకాణాలు, తినుబండారాల తయారీ వంటి రంగాల్లో రాణిస్తున్నారు. వారితోపాటు మరికొందరికి ఉపాధి చూపుతున్నారు. దీన్ని స్ఫూర్తిగా తీసుకొని పరిశ్రమల్లో గ్రామీణ మహిళలను భాగస్వాములను చేయాలి.



అతివలే అత్యధికం..

నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో మొత్తం మహిళా ఓటర్లు 11,34,305 మంది ఉన్నారు. పురుషులకంటే అతివలు 22,817 మంది ఎక్కువగా ఉన్నారు. సూర్యాపేట జిల్లాలో 11,778 మంది, నల్గొండ జిల్లాలో 9,067 మంది, యాదాద్రి జిల్లాలో 1,972 మంది మహిళలు అధికంగా ఉన్నారు.

మరో నలుగురికి ఉపాధి

గాలిదేవర రాణి, శ్రీనివాసనగర్, మిర్యాలగూడ మండలం



2009లో నా భర్త రహదారి ప్రమాదంలో మరణించారు. ఇద్దరు కుమారుల భవిష్యత్తు కోసం 2010లో రూ.30వేలు, 2014లో రూ.50వేల రుణంతో రెండు గేదెలు కొని పాల విక్రయం ప్రారంభించాను. కంపసాగర్‌లోని కృషి విజ్ఞానకేంద్రంలో చిరుధాన్యాల వంటకాలపై శిక్షణ పొంది.. రూ.రెండున్నర లక్షల రుణంతో ఆహార పదార్థాల తయారీ యంత్రాలు కొనుగోలు చేశాను. ప్రస్తుతం నెలకు రూ.20వేల ఆదాయం పొందుతూ మరో నలుగురికి ఉపాధి కల్పిస్తున్నాను.

నారీమణులు ఎదుగుతున్నారిలా..

❒ మిర్యాలగూడలో నివసిస్తున్న వేములపల్లి మండలం అన్నపురెడ్డిగూడెం గ్రామానికి చెందిన చల్లమల సందీపారెడ్డి చేతితో అలంకరణ వస్తువులు తయారు చేస్తూ మూడు గిన్నిస్ రికార్డులు సాధించారు.

❒ అనుముల మండలం హజారిగూడెం గ్రామస్థురాలు షేక్ జాహెదాబేగం ఐదు డిగ్రీలు, మూడు పీజీలు, పీహెచ్‌డీ చేశారు. లక్షా వంద పేజీల ప్రపంచంలోనే అతి పెద్ద గ్రంథం రూపకల్పనలో కీలకంగా వ్యవహరించి గిన్నిస్ బుక్ రికార్డు సాధించారు.

❒ కోదాడ మండలం తొగర్రాయి గ్రామానికి చెందిన మౌనిక పట్టుదలతో చదివి ఎస్సై ఉద్యోగం సాధించి గ్రామీణ మహిళలకు ఆదర్శంగా నిలిచారు.

జాతీయ రహదారిపై బారులు తీరిన వాహనాలు

చౌటుప్పల్, న్యూస్‌టుడే: హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారి-65 పై కార్లు, ఇతర వాహనాలు సోమవారం మధ్యాహ్నం నుంచి బారులు తీరాయి. దసరా పండగకు సెలవులు ఇవ్వడంతో హైదరాబాద్‌లో నివాసముంటున్న వారు పండగను సొంతూళ్లలో బంధుమిత్రులతో నిర్వహించుకునేందుకు పెద్ద సంఖ్యలో వారం క్రితం తరలి వచ్చారు. సెలవులు ముగిసి మంగళవారం నుంచి విద్యాలయాలు తెరుచుకోనున్నందున పిల్లలతో కలిసి హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. దీంతో తెలుగు రాష్ట్రాలకు వారధిలాంటి ఈ జాతీయ రహదారికి వాహనాల కళ వచ్చింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సాధారణంగానే ఉన్న వాహనాల రద్దీ సాయంత్రానికి బాగా పెరిగింది. ఒకదాని వెంట ఒకటిగా కార్లు, ఆర్టీసీ, ప్రైవేటు బస్సులు ప్రవాహంలాగా హైదరాబాద్ వైపు పరుగులు తీశాయి. పంతంగి టోల్ ప్లాజా దాటే సమయంలో వాహనదారులు నిరీక్షించాల్సి వచ్చింది. అక్కడి నుంచి చౌటుప్పల్ పట్టణం దాటేంత వరకు వాహనాలు నెమ్మదిగా ముందుకు కదిలాయి. ప్రయాణికులకు, వాహనదారులకు ఇబ్బందులు ఏర్పడకుండా సివిల్, ట్రాఫిక్ పోలీసులు, టోల్ సిబ్బంది చర్యలు తీసుకున్నారు.



చౌటుప్పల్‌లో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై వెళ్తున్న కార్లు

మూడు రోజుల పోలీస్ కస్టడీకి అనుమతి

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: ప్రభుత్వ భూమిని నిబంధనలకు విరుద్ధంగా ఇతరుల పేర్ల మీదకు మార్పిడి, రైతుబంధు నిధులు కాజేశారన్న కేసులో అరెస్టయిన గత హుజూర్‌నగర్ తహసీల్దార్ జయశ్రీ, ధరణి ఆపరేటర్ జగదీశ్‌ను పోలీస్ కస్టడీకి అనుమతిస్తూ కోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. తహసీల్దార్ జయశ్రీ, ఆపరేటర్ జగదీశ్‌లను విచారణ నిమిత్తం మూడు రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని కోరుతూ సోమవారం పోలీసులు పిటిషన్ వేశారు. మరో వైపు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ జయశ్రీ, జగదీశ్ వేసిన పిటిషన్‌ను న్యాయస్థానం డిస్మిస్ చేసి వారిని మూడు రోజుల పోలీస్ కస్టడీకి అనుమతించింది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ షకీల్ అహ్మద్ అన్సారి తెలిపిన వివరాల ప్రకారం.. ఇద్దరినీ మూడు రోజులు పోలీస్ కస్టడీకి అనుమతించాలని కోరుతూ సీఐ చరమందరాజు పిటిషన్ వేశారు. హుజూర్‌నగర్ న్యాయమూర్తి సెలవులో ఉండటంతో కోదాడ కోర్టులో పిటిషన్ వేశారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం జయశ్రీని, జగదీశ్‌లను మూడు రోజుల కస్టడీకి అనుమతిస్తూ ఆదేశాలు జారీ చేసింది. కోర్టు అనుమతితో ఈనెల 11న తహసీల్దార్ జయశ్రీని ఒక రోజు పోలీసులు విచారించిన సంగతి తెలిసిందే.

బుద్ధుడి బోధనలు ఆచరిస్తే ప్రపంచ శాంతి


నాగార్జునసాగర్, న్యూస్‌టుడే: నేడు ప్రపంచంలో నెలకొని ఉన్న పరిస్థితులు మారాలంటే బుద్ధుడి బోధనలు తప్పకుండా పాటించాలని శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం సాగర్‌లోని బుద్ధవనంలో నిర్వహించిన దమ్మ విజయం దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనాడు రాజ్యాధికారం కోసం యుద్ధం చేసినప్పుడు జరిగిన పరిస్థితులను చూసిన అశోకుడు శాంతిని బోధించే బౌద్ధమతాన్ని స్వీకరించారని ఆయన అనుసరించిన మార్గాన్ని అందరూ పాటిస్తే ప్రపంచం మొత్తం శాంతిగా ఉంటుందన్నారు. హైదరాబాద్ నుంచి సాగర్ వరకు ఉన్న ప్రదేశాలను సంస్థ కారిడార్‌గా చేయాలని, హైదరాబాద్ నుంచి సాగర్‌కు ప్యాకేజీగా ఏర్పాటు చేసి ప్రతి రోజు బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని పర్యాటక అభివృద్ధి సంస్థకు సూచించారు. పర్యాటక అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రితో చర్చించి బుద్ధవనాన్ని ప్రపంచంలోనే గొప్ప థీమ్‌పార్కుగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కోటిరెడ్డి, పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ ప్రకాశ్‌రెడ్డి, బుద్ధవనం ఓఎస్డీ సుధన్‌రెడ్డి, సబ్‌కలెక్టర్ అమిత్ నారాయణ్, కౌన్సిలర్ మంగ్తా నాయక్, ఈమని శివనాగిరెడ్డి, సూర్యప్రకాష్‌రావు, శ్యాంసుదర్, మహేంద్రహిల్స్‌లోని మహాబోధి బుద్ధవిహార్, మైసూర్ బైలాకుప్పెలోని మహాబోధి బుద్ధవిహార్ నుంచి వచ్చిన బౌద్ధ భిక్షువులు, హైదరాబాద్‌లోని కేంద్రీయ విశ్వవిద్యాలయానికి చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.



బుద్ధుడి పాదుకల వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, పర్యాటక సంస్థ ఛైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, తదితరులు

శుభ ముహూర్తాలొచ్చేస్తున్నాయ్..!

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: మూడు నెలల మూడాలు ముగిసి శుభకార్యాలకు తెర తొలిగే రోజులు సమీపిస్తున్నాయి. పెళ్లి బాజా భజంత్రీలతో సహా బరాత్‌ల మోత మోగనుంది. మరో మూడు నెలలు మంచి ముహూర్తాలు ఉన్నాయని, యాదాద్రి క్షేత్రంలోని ప్రధానాలయ పూజారులు, పంచాంగకర్తలు, బ్రాహ్మణ పూజారులు చెబుతున్నారు. వివాహ సంబంధాలు కుదుర్చుకునే క్రతువులు అంటే.. పెళ్లి చూపులు, సంబంధం ఒప్పందం, మాటాముచ్చట్లు ముమ్మరమయ్యాయి. వచ్చే నెల 3 నుంచి శుభ ఘడియలు మొదలై, 20 వరకు పన్నెండు శుభముహూర్తాలున్నట్లు పండితులు చెబుతున్నారు.



కార్తిక మాసం.. దీపావళి సంబరాలయ్యాక నవంబరు(కార్తీక మాసం)లో 3వ తేదీ రాత్రి వేళ. 7న ఉదయం, రాత్రి, 8న ఉదయం, 10వ తేదీ ఉదయం, రాత్రి, 13న ఉదయం 14న ఉదయం, 17న మూడు వేళల్లో, ఇక 20న ఉదయం మంచి ముహూర్తాలున్నాయి.

★ వచ్చే డిసెంబరు(మార్గశిరం) నెలలో 4, 5, 6, 11, 20, 25 తేదీల్లో వివాహ బంధాలకు శుభాశీస్సులు ఉన్నాయి.

మాఘ మాసంలో.. వచ్చే ఏడాది జనవరి (మాఘమాసం)లో 31న ఉదయం, రాత్రి రెండు ముహూర్తాలున్నాయి. ఫిబ్రవరి 2, 7 తేదీల్లో ఉదయం, రాత్రి, 13న ఉదయం, 14న రాత్రి, 16న మూడు వేళల్లో ముహూర్తాలున్నాయి. 20న రెండు, 22, 23 తేదీల్లో కూడా రెండేసి ముహూర్తాలున్నాయి.

ఫాల్గుణంలో.. వచ్చే మార్చి 2వ తేదీన ఉదయం రెండు, రాత్రి రెండు ముహూర్తాలు. 6వ తేదీన మూడు వేళల్లో కల్యాణ ఘడియలు ఉన్నట్లు పంచాంగకర్తలు, ప్రధాన పూజారి లక్ష్మీనరసింహాచార్య, విశ్రాంత పురోహితులు బుచ్చయ్యశర్మ తెలిపారు.

విష్ణుపురం స్టేషన్.. ఇక రైల్వే జంక్షన్!

మిర్యాలగూడ, న్యూస్‌టుడే: గుంటూరు-నడికుడి మార్గంలో నల్గొండ జిల్లా సరిహద్దులో ఉన్న విష్ణుపురం రైల్వేస్టేషన్‌ను 'రైల్వే జంక్షన్‌'గా మార్చాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. 20 వేల మెగావాట్ల సామర్థ్యంతో దామరచర్ల మండలం వీర్లపాలెం వద్ద రాష్ట్రంలోనే అతిపెద్ద 'యాదాద్రి థర్మల్ ప్లాంటు'ను నిర్మిస్తుండగా దీనికి సమీపంలో ఉన్న విష్ణుపురం స్టేషన్‌ను జంక్షన్‌ని చేయాలని అధికారులు ప్రతిపాదించారు. యాదాద్రి థర్మల్ ప్లాంటుకు నిత్యం 21 రైల్వే వ్యాగన్లలో కరీంనగర్ రామగుండం నుంచి బొగ్గు రవాణా చేయాల్సి ఉంటుంది. జాన్‌పహాడ్ మార్గంలో ప్రస్తుతం ఉన్న రైల్వే లైనుకు అదనంగా మరోలైను నిర్మిస్తున్నారు.

◆ సాధారణంగా మూడు మార్గాలు కలిసే స్టేషన్‌ను జంక్షన్‌గా మార్చుతారు. గుంటూరు-బీబీనగర్ రైల్వే లైను ఇప్పటివరకు ఒకే మార్గంగా ఉండగా ప్రస్తుతం రెండు వరసలుగా విస్తరిస్తున్నారు. మిర్యాలగూడ గుంతకల్లు రైల్వే లైను సైతం ఏర్పాటు చేయాలని రైల్వేశాఖ నిర్ణయించడంతో విష్ణుపురం స్టేషన్‌లో మరింత రద్దీ పెరిగే అవకాశం ఉంది. గుంటూరు, జాన్‌పహాడ్ లైను, వీర్లపాలెం యాదాద్రి థర్మల్ ప్లాంటు రైలుమార్గాలు ఇక్కడ కలుస్తుండగా జంక్షన్ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. ప్రస్తుతం రైల్వే లైన్ల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నందున జంక్షన్‌కు అవసరమైన విద్యుత్తు, రైల్వే సురక్షిత సౌకర్యాలు కల్పిస్తున్నారు.

◆ భవిష్యత్తులో ప్రమాదాలు జరగకుండా నియంత్రించే 'కవచ్' విధానం సైతం ఇక్కడ ఏర్పాటు చేసేలా సన్నాహాలు చేస్తున్నారు. యాదాద్రి థర్మల్ ప్లాంటుకు ఐదు కిలోమీటర్ల మేరకు రైల్వే లైను ఏర్పాటు చేస్తుండగా దీనికి అనుసంధానంగా జంక్షన్‌లో అవసరమైన పనులు జరిపించాలని నిర్ణయించినట్లు రైల్వే ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.



నల్గొండ జిల్లా సరిహద్దులో ఉన్న విష్ణుపురం రైల్వే స్టేషన్

ఉమెన్ సాఫ్ట్‌బాల్ ఆసియాకప్ పోటీలకు ఎంపిక

బీబీనగర్, న్యూస్‌టుడే: బీబీనగర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ సైనిక శిక్షణ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు ప్రతిష్ఠాత్మక టోర్నమెంట్‌లకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ సోమవారం ప్రకటనలో తెలిపారు. బీఏ తృతీయ సంవత్సర విద్యార్థిని గుగులోతు మమత యూనివర్సిటీ ఉమెన్ సాఫ్ట్‌బాల్ ఆసియాకప్-2024కు ఎంపికయ్యారని వెల్లడించారు. ఈ నెల 15 నుంచి 19 వరకు చైనాలో జరిగే పోటీల్లో మమత పాల్గొంటారని వెల్లడించారు.



మమత

★ మరో విద్యార్థిని(ఎంపీసీ మొదటి సంవత్సరం) రుక్మిణి ఖేలో ఇండియా సౌత్‌జోన్ నేషనల్ ఖోఖో టోర్నమెంట్‌కు నల్గొండ జిల్లా నుంచి ఎంపికైనట్లు తెలిపారు. తమిళనాడులోని కోయంబత్తూరులో ఈ నెల 15 నుంచి 17 వరకు జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. ప్రతిష్ఠాత్మక టోర్నమెంట్‌లకు ఎంపికైన గుగులోతు మమత, కె.రుక్మిణిని ప్రిన్సిపల్, కళాశాల అధ్యాపక బృందం అభినందించారు. జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో రాణించి కళాశాలతో పాటు జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు.



రుక్మిణి

విద్యుత్తుశాఖలో భారీగా బదిలీలు

నల్గొండ జిల్లా పరిషత్తు, న్యూస్‌టుడే: దక్షిణ ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ నల్గొండ సర్కిల్ పరిధిలో పెద్ద సంఖ్యలో ఉద్యోగుల బదిలీలు జరిగాయి. అటెండర్ మొదలుకొని డీఈ స్థాయి కేడర్ వరకు స్థానచలనం కల్పించారు. ఒకే స్థానంలో రెండేళ్లు పాటు సర్వీసు ఉన్న వారిని పరిగణనలోకి తీసుకుని 11 కేడర్లల్లో 50 శాతం ఉద్యోగులను బదిలీ చేయాలని సంస్థ ఇది వరకే షెడ్యూల్ విడుదల చేసిన విషయం తెలిసిందే. వాస్తవానికి ఈ నెల 6వ తేదీన బదిలీల ఉత్తర్వులు వెల్లడి కావాల్సి ఉంది. ఉద్యోగ సంఘాల ప్రతినిధులు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో వాయిదా పడింది.

బదిలీలు ఇలా.. తాజాగా ఆదివారం అర్ధరాత్రి కార్పొరేట్ కార్యాలయం నుంచి ఏఈ, ఏడీఈ, డీఈలను బదిలీ చేస్తూ ఉత్తర్వుల ప్రతులను ఆయా అధికారులకు వ్యక్తిగతంగా అందించారు. అందులో నల్గొండ డీఈ వెంకటేశ్వర్లును బదిలీ చేసి వెయిటింగ్‌లో పెట్టారు. స్టోర్ ఏడీఈ నాగిరెడ్డి హైదరాబాద్‌కు, నల్గొండ రూరల్ ఏడీఈ సత్యనారాయణ సూర్యాపేట స్టోర్‌కు బదిలీ అయ్యారు. వారి స్థానంలో నల్గొండ డీఈగా అన్నయ్య హైదరాబాద్ నుంచి పదోన్నతిపై, భువనగిరి డీఈ రవిప్రసాద్‌ను నల్గొండ ఎంఆర్టీ విభాగానికి (ఇన్‌ఛార్జి ఎస్ఈ నల్గొండ), మిర్యాలగూడ డీఈగా సుధీర్‌కుమార్, నల్గొండ స్టోర్ ఏడీఈగా శంకరయ్యయాదవ్, హాలియా ఏడీగా తిరపతయ్య, నల్గొండ రూరల్ ఏడీఈగా బల్యానాయక్, ఖర్చుల విభాగం ఏవోగా రవికృష్ణ, నల్గొండ టీఆర్ఈ ఏడీఈగా శ్రీనివాస్‌రెడ్డి, నల్గొండ స్టోర్ ఏఈగా వెంకటేశం నిర్మాణం విభాగం డీఈ బి.వెంకటయ్య బదిలీపై వచ్చారు. వీరితోపాటు మరి కొంత మంది ఏఈ, ఏడీఈలు బదిలీ అయ్యారు. సోమవారం సర్కిల్ కార్యాలయ పరిధిలోని ఉద్యోగులతోపాటు నల్గొండ, దేవరకొండ, మిర్యాలగూడ డివిజన్ స్థాయిలో అసిస్టెంటు లైన్‌మెన్ నుంచి లైన్ ఇన్‌స్పెక్టర్ల స్థాయి వరకు సుమారు 350 మంది ఉద్యోగులకు స్థాన చలనం కల్పించారు. కొంత మంది అధికారులు బదిలీ ఉత్తర్వులు అందిన వెంటనే సోమవారం బాధ్యతలు చేపట్టారు.

పైరవీలకు పెద్దపీట..!..

విద్యుత్తుశాఖ పరిధిలో ఉద్యోగుల బదిలీల్లో పైరవీలకు పెద్దపీట వేసినట్లు ఉద్యోగ సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను అధికారులు తిలోదకాలిచ్చారు. చేతులు తడిపిన వారికి కోరుకున్న చోట పోస్టింగ్ ఇచ్చారని, సెక్షన్ నుంచి మరో సెక్షన్‌కు బదిలీ కావాల్సిన ఉద్యోగులను పనిచేస్తున్న సెక్షన్‌లోనే బదిలీ చేయడం, రెండేళ్ల సర్వీసు నిండని ఉద్యోగులకు సైతం స్థాన చలనం కల్పించడం అధికారులపై వస్తున్న అవినీతి ఆరోపణలకు బలం చేకూరుస్తోంది. అధికారుల తీరుపై కొంత మంది ఉద్యోగ సంఘాల ప్రతినిధులు సైతం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం.

పురుగు మందు తాగి బలవన్మరణం

మునుగోడు, న్యూస్‌టుడే: పురుగు మందు తాగి బలవన్మరణానికి పాల్పడిన ఘటన మునుగోడు మండలం కచిలాపురంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జిట్టా ముత్తయ్య (55) వృత్తి రీత్యా వ్యవసాయ కుటుంబం. మద్యానికి బానిసైన ఆయన నిత్యం తాగి వస్తుండటంతో పలుమార్లు కుటుంబ సభ్యులు మందలించినా వదలడం లేదు. మద్యం తాగొద్దని చెబితే పురుగు మందు తాగి బలవన్మరణం చేసుకుంటానని ఇటీవల ఒక్కసారి బెదిరింపులకు గురి చేశారు. కనీసం సమయానికి తిండి తినకుండా మళ్లీ కొద్ది రోజులుగా నిత్యం మద్యం తాగుతుంటే ఆరోగ్యం క్షీణిస్తుందనే ఉద్దేశంతో తాగొద్దని మందలించడంతో మరోసారి బెదిరించేందుకు ప్రయత్నం చేశారు. సోమవారం తన వ్యవసాయ బావి వద్దకి వెళ్లి పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. బావి వద్దకు వెళ్లిన వ్యక్తి ఇంటికి రాలేదని అనుమానంతో ఆయన భార్య అక్కడికి వెళ్లి చూడగా అప్పటికే అపస్మారక స్థితిలోకి వెళ్లారు. వెంటనే స్థానికుల సాయంతో మునుగోడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం 108లో నల్గొండ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుడి భార్య పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	126–00
రిటైల్	146–00
డ్రెస్డ్	215–00
స్కిన్‌లెస్	244–00

కోదాడ

• కోదాడ • హుజూర్‌నగర్

నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తాం

కోదాడ, న్యూస్‌టుడే: అర్హత లేకుండా స్థాయికి మించి ఆర్‌ఎంపీ కేంద్రాల్లో వైద్యం చేస్తున్నారని పబ్లిక్ రిలేషన్ కమిటీ ఛైర్మన్ నరేశ్ అన్నారు. తెలంగాణ వైద్య మండలి ఛైర్మన్ మహేశ్ కుమార్ ఆదేశాల మేరకు సోమవారం పట్టణంలో తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని పలువురి కేంద్రాలను తనిఖీ చేసి ఆగ్రహం వ్యక్తం చేశారు. బెడ్లు ఏర్పాటు చేసి వైద్యం ఎలా చేస్తారని ప్రశ్నించారు. వైద్యులు అనుమతి లేకుండా మందులు ఇవ్వడం, అనుమతి లేని మెడిసిన్ విక్రయించడంపై అసహనం వ్యక్తం చేశారు. అనంతరం ఓ కేంద్రంలోని బెడ్లను తొలగించారు. మరోసారి నిబంధనలను ఉల్లంఘించి వైద్యం చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సన్మానం

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే: కాపుగల్లు గ్రామంలో ఒకే కుటుంబానికి చెందిన చలసాని గురవయ్య మనుమరాళ్లు ఉషశ్విని, తేజస్వినిలకు ఎంబీబీఎస్‌లో సీటు రావడంతో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పాండురంగారావు వారిని శాలువాలతో సన్మానించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) 80085 50363 96030 18889

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే:

? వెంగమాంబ రెసిడెన్సీకి వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. మురుగు కాలువపై ఉన్న స్లాబ్ కూలిపోయి పాదచారులు, ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

–వెంకటనారాయణ, భవానీనగర్, కోదాడ

✔ పరిశీలించి త్వరలోనే గుంతలను పూడ్పించి, మురుగు కాలువపై స్లాబ్‌ను ఏర్పాటు చేస్తాం.

–రమాదేవి, పుర కమిషనర్, కోదాడ

నూతన ఉపాధ్యాయులకు సన్మానం

చిలుకూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన డీఎస్సీలో ఉద్యోగం సాధించిన నూతన ఉపాధ్యాయులను సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం సన్మానించారు. మండల వ్యాప్తంగా ఆయా గ్రామాలలో ఎంపికైన



చిలుకూరు సీపీఐ భవన్‌లో నూతన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సీపీఐ, ఎస్టీయూ సంఘ నాయకులు

నూతన ఉపాధ్యాయులతో పాటు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంక్ సాధించిన పూల సౌమ్యను సన్మానించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చంద్రశేఖర్, జిల్లా, మండల కార్యదర్శులు బెజవాడ వెంకటేశ్వర్లు, మండవ వెంకటేశ్వర్లు, కొండలు, ఆంజనేయులు, ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘ నాయకులు పాల్గొన్నారు.

మునగాల: ఉపాధ్యాయులు నవ సమాజ నిర్మాతలని సీఐ రామకృష్ణారెడ్డి అన్నారు. డీఎస్సీ ఫలితాల్లో ఉపాధ్యాయులుగా ఎంపికైన దినేష్, అమూల్య, శిరీష, అనూషలను మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో సామాజిక కార్యకర్త సైదులు ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై వారిని సన్మానించారు.

హుజూర్‌నగర్ గ్రామీణం: వేపలసింగారం గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ మీసాల శ్రీను, విజయ దంపతుల కుమార్తె మౌనిక ఎస్జీటీ ఉద్యోగం సాధించింది. ఆమెను స్థానిక నాయకులు సోమవారం సత్కరించారు. నెమ్మాది రవి, వెంకటేశ్వర్లు, కలకొండ పెద్ద చంద్రయ్య, చింతిరాల శ్రీను సత్కరించిన వారిలో ఉన్నారు.

చిన్నారులు.. కరాటే వీరులు



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న మాధవీలత

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే: ఆత్మరక్షణతోపాటు ఆత్మ విశ్వాసానికి ఆయుధం కరాటే. పిల్లల అభిరుచులు తెలుసుకొని అందుకు అనుగుణంగా బాల్యం నుంచే శిక్షణ ఇస్తే అద్భుతాలు సృష్టిస్తారు. ఈ విధంగానే కోదాడలోని పలువురు విద్యార్థులు కరాటేలో ప్రతిభ కనబర్చి మిర్యాలగూడలో గత నెల జరిగిన 22వ జాతీయ స్థాయి ఓపెన్ కరాటే, కుంగ్‌ఫూ ఛాంపియన్‌షిప్ పోటీల్లో బంగారు పతకాలు సాధించారు.

తల్లిదండ్రుల ప్రోత్సాహంతో..

ఆరాధ్య



నేను నాలుగో తరగతి చదువుతున్నాను. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో అకాడమీలో చేరి శిక్షణ పొందుతున్నాను. కరాటే ఇన్‌స్ట్రక్టర్ మాధవీలత నేర్పిన మెలకువలతో వైట్ బెల్ట్‌తో పాటు బంగారు పతకం సాధించా. చదువుతోపాటు క్రీడల్లో రాణించాలనేది లక్ష్యం.

రోజూ వేకువజామునే మైదానానికి: తీర్థ



నేను ఎనిమిదో తరగతి చదువుతున్నాను. చిన్నప్పటి నుంచి కరాటే నేర్చుకోడమంటే ఇష్టం. ప్రతిరోజు వేకువజామునే మైదానానికి వెళ్లి మాస్టర్ ఆధ్వర్యంలో రెండేళ్లుగా శిక్షణ తీసుకుంటున్నా. కరాటేతో ఆత్మ విశ్వాసం పెరుగుతుంది. జాతీయస్థాయిలో బంగారు పతకం సాధించడం సంతోషం కలిగింది. చదువుతో పాటు కరాటేలో రాణిస్తూ బహుమతులు సాధించడం తృప్తిగా ఉంది.

ఆనందంగా ఉంది: అర్జున్ కార్తికేయ

జాతీయస్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించడం ఆనందంగా ఉంది. ఏడాదిగా శిక్షణ తీసుకుంటున్నా. ఒకేసారి



జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనడం సంతోషాన్నిచ్చింది. కరాటే నేర్చుకుంటే శారీరకంగా, మానసికంగా ఉపయోగకరం. మాస్టర్ కావాలనే లక్ష్యంతో కష్టపడుతున్నా.

మెలకువలు నేర్చుకుంటున్నా:

సన్విత



సినిమాల్లో హీరోలు చేస్తున్న ఫైట్‌ను చూసి కరాటే నేర్చుకోవాలనే తపన కలిగింది. మా తల్లిదండ్రులను ఒప్పించి శిక్షణ పొందుతున్నా. ఏడాది నుంచి మెలకువలు నేర్చుకున్నాను. కరాటేలో మంచి ప్రతిభ కనబర్చి మిర్యాలగూడ పోటీల్లో ఆరెంజ్ బెల్ట్‌తో పాటు బంగారు పతకం సాధించాను.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక



రిత్విక్



ఈశ్వర్

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించే 68వ రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు కోదాడకు చెందిన విద్యార్థులు ఉమ్మడి నల్గొండ జట్టుకు ఎంపికైనట్లు కోదాడ క్రికెట్ అకాడమీ కోచ్ షేక్.సిద్ధిఖ్ సోమవారం తెలిపారు. కోదాడకు చెందిన సందేశి రిత్విక్, ధరావత్ ఈశ్వర్‌లు ఎంపికయ్యారని చెప్పారు. అండర్-14 క్రికెట్ పోటీలు జోగులాంబ గద్వాల్ జిల్లాలో ఈనెల 15 నుంచి 18 వరకు జరగనున్నట్లు పేర్కొన్నారు. ఎంఈవో సలీంషరీఫ్, కోదాడ క్రికెట్ అకాడమీ అధ్యక్షుడు కొత్తపల్లి సురేష్, ఖాజామియా, దర్గయ్య, క్రీడాకారులు వారికి అభినందనలు తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

కోదాడ గ్రామీణం, న్యూస్‌టుడే: సైబర్ నేరాలపై అవగాహన తప్పనిసరిగా ఉండాలని కోదాడ గ్రామీణ ఎస్సై అనిల్ రెడ్డి తెలిపారు. నల్లబండగూడెంలో సోమవారం డ్రగ్స్,



నల్లబండగూడెంలో అవగాహన కల్పిస్తున్న ఎస్సై అనిల్‌రెడ్డి

సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలపై పోలీసుల కళాబృందంతో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. సైబర్ మోసాలపై 1930 టోల్ ఫ్రీ నంబరుకు ఫిర్యాదు చేయాలని విజ్ఞప్తి చేశారు. పోలీస్ సిబ్బంది, సురేష్, శ్రీకాంత్, కళాబృందం ఇన్‌ఛార్జి యల్లయ్య, గోపయ్య, గురులింగం తదితరులున్నారు.

ప్రొ. సాయిబాబా మరణం తీరని లోటు

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే: రాజ్యహింసకు వ్యతిరేకంగా ఆదివాసుల హక్కుల కోసం నిరంతరం పోరాడిన సాయిబాబా మరణం తీరని లోటని



సాయిబాబా చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న జన చైతన్య వేదిక కన్వీనర్ చిన్ని, నాగమణి, పీడీఎస్‌యూ నాయకులు

జనచైతన్య వేదిక కన్వీనర్ రాయపూడి వెంకటేశ్వరరావు(చిన్ని), కో కన్వీనర్ నాగమణి అన్నారు. ఎం.ఎస్. కళాశాలలో సోమవారం జన చైతన్య వేదిక పూర్వ, ప్రస్తుత పీడీఎస్ నాయకులు ఏర్పాటు చేసిన సంతాప సభలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. నాయకులు నాగిరెడ్డి, విజయ్‌కుమార్, రామనర్సయ్య, సైదులు, అరుణోదయ జిల్లా అధ్యక్షుడు ఉదయగిరి, అధ్యాపకులు పాల్గొన్నారు.

నాడు విద్యార్థి.. నేడు ప్రధానోపాధ్యాయుడు



ఉపేందర్

నడిగూడెం, న్యూస్‌టుడే: తాను చదువుకున్న బడిలో ఉపాధ్యాయుడిగా పనిచేసే అవకాశం రావడం సహజం. కానీ ప్రధానోపాధ్యాయుడిగా పని చేయడం అరుదు. ఇలాంటి కోవకు చెందిన వారే మండలంలోని సిరిపురం గ్రామానికి చెందిన డ్రా ఉపేందర్. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియలో భాగంగా తాను చదువుకున్న సిరిపురం జడ్పీ ఉన్నత పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడిగా నియామకమయ్యారు. సొంత ఊరిలో, తాను చదువుకున్న బడిలోనే పనిచేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. స్థానికులు, గ్రామస్థుల సహకారంతో పాఠశాల ఉన్నతికి, పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు తన వంతు కృషి చేస్తానంటున్నారు.



నాటి విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

చిలుకూరు, న్యూస్‌టుడే: బేతవోలులోని ప్రతిభ ఉన్నత పాఠశాలలో 1996-97లో పదో తరగతి చదివిన విద్యార్థులు స్థానిక ఫంక్షన్ హాలులో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. సాయంత్రం వరకు ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు.

భారీ నష్టం.. అంతంతే పరిహారం



కేఆర్సీపురంలో ఇసుక, రాళ్లమయంగా మారిన పొలం

నడిగూడెం, న్యూస్‌టుడే: అకాల వర్షాలు, వరదలతో పూర్తి స్థాయిలో పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అరకొరగా పరిహారం మంజూరు చేసిందని, అది సరిపోదని బాధిత రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత నెలలో కురిసిన భారీ వర్షాలు, వరదలు, సాగర్ ఎడమ కాల్వకు గండి పడి పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేల చొప్పున వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. ఎనిమిది గ్రామాల పరిధిలోని 135 మంది రైతులకు చెందిన 201.5 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు అధికారులు ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. ఈ మేరకు ఆయా రైతుల ఖాతాల్లో ఎకరాకు రూ.10 వేల చొప్పున పరిహారం దసరా పండగకు ఒక రోజు ముందు జమ చేశారు. కేవలం పంట నష్టపోయిన రైతులకు పరిహారం మంజూరు చేశారు. కానీ కాల్వకు రెండు చోట్ల గండి పడి వరద నీటి తాకిడికి కాగితరామచంద్రాపురం పరిసరాల్లో 142 ఎకరాల్లో పంట నీట మునిగింది. మరో 40 ఎకరాల్లో ఇసుక మేటలు, రాళ్ల రప్పలతో నిండిపోయాయి.

★ వీటిని సాగు భూములుగా మార్చుకోవాలంటే ఎకరాకు రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు వ్యయం అవుతుందని, ప్రభుత్వం కేవలం రూ.10వేల పరిహారం చెల్లించడంతో తమ భూములను ఎలా సాగు చేసుకోవాలని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాగర్ ఎడమ కాల్వకు గండ్లు పడటం వల్ల పంట భూములను కోల్పోయిన రైతులకు ప్రభుత్వం ప్రత్యేక పరిహారం మంజూరు చేయాలని, ఇసుక మేటలు, రాళ్లు తొలగించుకునేందుకు నిధులు కేటాయించాలని బాధిత రైతులు కోరుతున్నారు. పొలాల్లో ఇసుక మేటలు వేసిన రైతుల వివరాలు నివేదికలో పొందుపరిచామని ఏవో ఆర్.దేవప్రసాద్ తెలిపారు. పరిహారం మంజూరుపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు.

వాసవీ, వనిత క్లబ్ గవర్నర్‌గా ఎన్నిక



రాచకొండ విజయలక్ష్మి

నేరేడుచర్ల, న్యూస్‌టుడే: వాసవి, వనిత క్లబ్‌ల గవర్నర్‌గా 2025 ఏడాదికి పురపాలికకు చెందిన రాచకొండ విజయలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సోమవారం తెలిపారు. గతంలో వనితా క్లబ్ అధ్యక్షురాలిగా పదవీ బాధ్యతలు నిర్వహించారు. అనంతరం జోన్ ఛైర్‌పర్సన్‌గా, అంతర్జాతీయ ప్రోగ్రాం సమన్వయకర్తగా అనేక పదవులు నిర్వహించారు. 2019లో ఉత్తమ మహిళా పారిశ్రామికవేత్తగా అవార్డు, వైశ్య గురురత్న అవార్డును అందుకొన్నారు. ఆమె ఎంపికపై పలువురు క్లబ్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

డిగ్రీ కళాశాలల నిరవధిక బంద్

నేరేడుచర్ల, న్యూస్‌టుడే: విద్యార్థుల చదువులకు ఫీజ్ రీయింబర్స్‌మెంటు నిధులు మంజూరు చేయకపోవడంతో డిగ్రీ కళాశాలలను నిరవధిక బంద్ చేస్తున్నట్లు న్యూ అరబిందో డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర టీపీడీపీఎంఏ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా కళాశాలల బంద్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గత మూడేళ్లుగా నిధులు మంజూరు కాకపోవటంతో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 50 వేల మందికి పైగా అధ్యాపకులకు జీతాలు చెల్లించలేని పరిస్థితి నెలకొందని వాపోయారు.

కులగణనకు జీవో జారీ బీసీల విజయం

హుజూర్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: కుల గణన చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేయడం బీసీల విజయమని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధనుంజయ నాయుడు అన్నారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో సోమవారం విలేకర్లతో మాట్లాడారు. బీసీ సంఘాలు విభిన్న రూపాల్లో ఆందోళన చేసిన ఫలితంగానే ఇది సాధ్యమైందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని చెప్పారు. భాజపా బీసీ వ్యతిరేక పార్టీ అని విమర్శించారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, సీపీఐ పట్టణ కార్యదర్శి వెంకటేశ్వర్లు, నర్సయ్య, అంజయ్య పాల్గొన్నారు.

నేటి నుంచి ఉచిత గాలి కుంటు నివారణ టీకాలు

నేరేడుచర్ల, న్యూస్‌టుడే: మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో మంగళవారం నుంచి ఉచితంగా గాలికుంటు వ్యాధి టీకాలు అందించనున్నట్లు ఇన్‌ఛార్జి పశువైద్యాధికారి రవినాయక్ తెలిపారు. సోమవారం పశువైద్య కేంద్రంలో మాట్లాడుతూ ఆవులు, గేదెలు, ఎద్దులు,, దూడలకు టీకాలు అందిస్తామన్నారు. మండల పరిధిలో సుమారు 10 వేలకు పైగా పశు సంపద ఉన్నట్లు, పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వరికి ఎలుకల బెడద



మునగాల, న్యూస్‌టుడే: ప్రస్తుతం సాగర్ ఎడమ కాల్వకు నీటిని విడుదల చేయడం, సన్న రకం ధాన్యానికి ప్రభుత్వం రూ.500 బోనస్ ప్రకటించడంతో వరిసాగు పెరిగింది. మండల వ్యాప్తంగా వరి పంట 22,000 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ప్రస్తుతం వరి పొట్ట దశలో ఉంది. ఈ దశలో రైతులకు ఎలుకల బెడద దడ పుట్టిస్తోంది. పంటపై దాడి చేస్తుండటంతో దిగుబడిపై ప్రభావం పడుతుందని వారు ఆందోళన చెందుతున్నారు. పంటను కాపాడుకోవడానికి నానా తంటాలు పడుతున్నారు. అయితే సమగ్ర యాజమాన్య పద్ధతులతో పంటల్లో ఎలుకల నివారణ సాధ్యమే అంటున్నారు వ్యవసాయాధికారులు.

పచ్చిగడ్డి తొలగించాలి: ఎల్లయ్య, ఏడీఏ.. వరి మడుల్లో తగినంత నీరు నిల్వ ఉండేలా చూసుకోవాలి. దీనివల్ల ఎలుకల దాడి నుంచి పంటను కాపాడుకోవచ్చు. ముఖ్యంగా గట్లపై ఉండే పచ్చిగడ్డిని తొలగించాలి. విషపు ఎరను ప్రయోగించడం వల్ల ఎలుకలు చనిపోతాయి

కాలనీళ్లు.. కదలని తీరు

కోదాడ, న్యూస్‌టుడే: ఇళ్లల్లో వాడే మురుగు నీరు, రహదారి మీదకు వచ్చే వర్షపు నీరు తీసుకెళ్లే విధంగా డ్రైనేజీలు ఉండాలి. కానీ వాటి నిర్మాణం అందుకు అనువుగా లేకపోవడంతో ఎక్కడి నీరు అక్కడే నిల్వ ఉండి దోమల వ్యాప్తి పెరుగుతోంది. డ్రైనేజీ నిర్మాణం రహదారికి తక్కువ ఎత్తులో నిర్మించాలి. అప్పుడే రహదారి మీదకు వచ్చిన మురుగు, వర్షపు నీరు డ్రైనేజీలోకి వెళ్తాయి. కానీ పట్టణాలలో డ్రైనేజీలు రహదారి కంటే ఎత్తులో నిర్మించడంతో ఇంజినీరింగ్, పురపాలక అధికారులపై విమర్శలు తలెత్తుతున్నాయి.

ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం..

చాలా చోట్ల ఇష్టారాజ్యంగా డ్రైనేజీల నిర్మాణాలు చేపట్టారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే ఇలా నిర్మాణాలు చేపట్టారు. దీనిపై స్థానికులు కొందరు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం. అప్పుడు నిర్మించిన అధికారులను గుర్తించి వారిపైనా శాఖపరమైన చర్యలు తీసుకుంటేనే మరోసారి ఇలాంటి తప్పిదాలు పునరావృతం కావు. రూ.లక్షలు వెచ్చించి అడ్డదిడ్డంగా నిర్మాణాలు చేపట్టి ప్రజాధనం వృథా చేస్తున్నారని పట్టణ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్న రహదారికి ఇరువైపులా ఉన్న డ్రైనేజీ నిర్మాణాలు రహదారి కంటే ఎత్తులో ఉన్నాయి. అలాగే ఇళ్ల యజమానులు కూడా డ్రైనేజీల మీద నిర్మాణాలతో ఆక్రమించారు. దీంతో వర్షాలకు రహదారి మీద నీరు నిల్వ ఉంటోంది. అధికారులు నిర్లక్ష్యంగా, అవగాహన లేకుండా డ్రైనేజీ, సీసీ నిర్మాణాలు చేపడుతున్నారు అనడానికి కోదాడ పట్టణంలో నిర్మించిన ఈ చిత్రమే సాక్ష్యం. ఇలా అవగాహన లేక నిర్మాణాలు చేపట్టినవి ప్రతి పట్టణంలో 30 శాతానికి పైగా ఉంటాయి. దీంతో ఆ ప్రాంతాల ప్రజలు వర్షాల సమయంలో రహదారి మీద నీరు నిల్వ ఉండటంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు నిర్మాణాల సమయంలో జాగ్రత్తలు పాటించాలని స్థానికులు కోరుతున్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకుంటాం:

రమాదేవి, పుర కమిషనర్, కోదాడ

పట్టణంలో కొన్ని ప్రాంతాల్లో డ్రైనేజీల నిర్మాణాలు రహదారికి మించి ఎత్తులో నిర్మించినట్లు మా దృష్టికి వచ్చింది. రోడ్డు మీద నీరు నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించి చర్యలు చేపడతాం. అవి గతంలో నిర్మించినవి. అప్పుడున్న అధికారులు అలా ఎందుకు అనుమతించారో తెలియదు. ఇప్పుడు అలాంటి నిర్మాణాలు చేపడితే సంబంధిత బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

బోర్డు ఉంది.. వివరాల్లేవ్..!

ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేసే అధికారుల వివరాలు కార్యాలయంలోని బోర్డులో పొందుపరచాలి. 2005 సమాచార హక్కు చట్టం ప్రకారం ప్రతి కార్యాలయంలో అధికారుల పేర్లు తప్పనిసరిగా ప్రదర్శించాలి. కానీ కోదాడ పట్టణంలోని మిషన్ భగీరథ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం బోర్డు అధికారుల వివరాలు లేక బోసిపోయింది. పని నిమిత్తం కార్యాలయానికి వచ్చిన ప్రజలు ఏ అధికారికి తమ సమస్యలు విన్నవించుకోవాలో తెలియని దుస్థితి. ఇలా పట్టణంలోని పలు కార్యాలయాల్లో అధికారులు వివరాలు ప్రచురించట్లేదు. బదిలీపై వెళ్లిన తర్వాత నూతనంగా వచ్చే అధికారి వివరాలు తక్షణమే మార్చాల్సి ఉన్నా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. దీనిపై మిషన్ భగీరథ డీఈని వివరణ కోరేందుకు 'న్యూస్‌టుడే' ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

– కోదాడ న్యూస్‌టుడే



మిషన్ భగీరథ కార్యాలయంలో వివరాలు లేని బోర్డు

నాలుగు డీఏలను తక్షణమే విడుదల చేయాలి

చిలుకూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన నాలుగు డీఏలను తక్షణమే ప్రభుత్వం విడుదల చేయాలని సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన చిలుకూరులో విలేకరులతో మాట్లాడారు. గత రెండు సంవత్సరాలుగా ప్రభుత్వం డీఏలను మంజూరు చేయడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

'ధరల నియంత్రణలో పాలకులు విఫలం'

గరిడేపల్లి, న్యూస్‌టుడే: నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు శేఖర్‌రావు అన్నారు. కీతవారిగూడెంలో జరిగిన మండల జనరల్‌బాడీ సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో ప్రజలు నమ్మి మోసపోయారని మండల కార్యదర్శి యాకూబ్ ఆరోపించారు.

బేతవోలు ఘటనలో పది మందిపై అట్రాసిటీ కేసు

చిలుకూరు, న్యూస్‌టుడే: దసరా పండగ రోజు బేతవోలులో జరిగిన ఘర్షణలో పలువురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైనట్లు ఎస్సై రాంబాబుగౌడ్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇరువర్గాల ఘర్షణలో గ్రామానికి చెందిన వట్టికూటి నాగయ్య, వట్టికూటి ధనమూర్తి, వట్టికూటి సతీష్, సాయిలీ నవీన్, ముస్కుల వీరారెడ్డి, కేశగాని నాగేంద్ర, బెల్లంకొండ కన్నయ్య, శీలం సైదులు, వడ్డాణపు రామకృష్ణ, వట్టికూటి అంజిబాబులపై అట్రాసిటీ కేసు నమోదైనట్లు పేర్కొన్నారు. తదుపరి చర్యలను కోదాడ డీఎస్పీ ఆదేశాల మేరకు తీసుకోనున్నట్లు తెలిపారు. చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే ఎవరికైనా శిక్షలు తప్పవని హెచ్చరించారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

మిర్యాలగూడ గ్రామీణం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని దొండవారిగూడెం గ్రామ సమీపంలో నాగార్జునసాగర్ ఎడమకాల్వలో ఆదివారం గల్లంతైన వెంకటాచారి మృతదేహం సోమవారం లభ్యమైంది. గ్రామీణ ఎస్సై పి.లోకేష్ వెల్లడించిన వివరాల ప్రకారం.. దసరా పండగ వేళ బంధువులతో కలసి ఈత సరదా కోసం వెళ్లి పొడకంటి వెంకటాచారి నీటి ప్రవాహంలో మునిగి గల్లంతయ్యారు. భార్య పొడకంటి సుష్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని వెతగ్గా సోమవారం సాయంత్రం సూర్యాపేట జిల్లా పొనుగోడు గ్రామ సమీపంలోని ఎడమకాల్వ నీటిపై తేలుతున్న మృతదేహం కనిపించటంతో బయటికి తీసి మిర్యాలగూడ ప్రాంతీయాసుపత్రికి తరలించామని పోలీసులు తెలిపారు.

అవీ ఇవీ

ఎన్నిక.. కోదాడ పట్టణం: కోదాడ హరిహర సేవా సమితి అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన మంత్రిప్రగడ శ్రీధర్‌ను ఎన్నుకున్నారు. సర్వబ్రాహ్మణ సంఘ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సర్వ సభ్య సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయనతో పాటు ఉపాధ్యక్షుడిగా రామమూర్తి, ప్రధాన కార్యదర్శిగా ఎంవీఆర్ఎస్ శర్మ, కోశాధికారిగా సీహెచ్.కృష్ణమాచార్యులను ఎన్నుకున్నారు.

ఇచ్చిన వాగ్దానాలు నిలబెట్టుకోవాలి.. నడిగూడెం: రైతు రుణమాఫీపై ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకోలేకపోతూ రోజుకో మాట మార్చుతూ వ్యవసాయ శాఖ మంత్రిగా కొనసాగడం మంత్రి నాగేశ్వరరావుకు న్యాయం కాదని తెలుగు రైతు సంఘం రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. రుణమాఫీ అమలు చేయడంలో ప్రభుత్వ విఫలమైందన్నారు.

నివాళి.. హుజూర్‌నగర్: డాక్టర్ సుదర్శన్‌నాయుడు ఆకస్మిక మరణంతో పలువురు నాయకులు, వైద్యులు, న్యాయవాదులు, ప్రజాప్రతినిధులు, ఆర్ఎంపీల సంఘం నాయకులు పలువురు నివాళి అర్పించారు. సోమవారం సుదర్శన్‌నాయుడికి అంత్యక్రియలు జరిగాయి. పెద్ద సంఖ్యలో పట్టణ ప్రజలు వచ్చి ఆయనకు నివాళి అర్పించారు.

హుజూర్‌నగర్ గ్రామీణం: డాక్టర్ సుదర్శన్‌నాయుడు మృతిపట్ల సీపీఐ నాయకులు సోమవారం నివాళి అర్పించారు. ఆయన మృతదేహంపై పూలమాల వేసి నివాళి అర్పించారు. సీపీఐ పట్టణ కార్యదర్శి వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, రాములు, శ్రీనివాస్, ధనుంజయ నాయుడు పాల్గొన్నారు.

కేసు నమోదు.. గరిడేపల్లి: అనుమతులు లేకుండా డీజే పెట్టి పాదచారులకు ఇబ్బందులు కల్గిస్తున్న డీజే యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చలిగంటి నరేష్ తెలిపారు. కీతవారిగూడెంలో లచ్యాతండా గ్రామానికి చెందిన వాంకుడోతు శ్రీకాంత్ డీజే, వాహనంతో శబ్ద కాలుష్యం, ప్రజాశాంతికి ఆటంకం కల్గిస్తున్నట్లు గుర్తించి డీజే, వాహనం సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

ఆహ్వానం.. కోదాడ పట్టణం: ధర్మకర్తల మండలికి వివిధ దేవాలయాల్లో ధర్మకర్తల నియామకం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు దేవాలయాల ఇన్‌ఛార్జి కార్యనిర్వహణాధికారి వెంకటచలపతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఫిర్యాదు.. కోదాడ: తన కుమారుడు, కోడలు ఆలనాపాలన చూడకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఓ వృద్ధురాలు ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ఫిర్యాదు చేసింది. గాంధీనగర్‌కు చెందిన వెంకమ్మ అనే వృద్ధురాలికి కుమారుడు, కూతుర్లు ఉండగా అందరి వివాహాలు అయ్యాయి. తనకు వచ్చిన పింఛన్ కూడా తీసుకుంటున్నాడని, తన కూతుర్లను కూడా భయభ్రాంతులకు గురి చేస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొంది.

సినిమాలు

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే:

విష్ణురామ్: దేవర, విశ్వం, మా నాన్న సూపర్‌హీరో, వేట్టయన్, జనక అయితే గనక, **శ్రీనివాస:** దేవర, **కాన్‌ప్లెక్స్:** వేట్టయన్, విశ్వం, మానాన్న సూపర్ హీరో, **రంగా:** వేట్టయన్, **వెంకటేశ్వర:** విశ్వం

సూర్యాపేట


• సూర్యాపేట • తుంగతుర్తి

దరఖాస్తుకు నేడే చివరి అవకాశం

ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: హైదరాబాద్‌కు చెందిన సమర్థనం దివ్యాంగుల సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని నిరుద్యోగ దివ్యాంగ యువతీయువకులకు ఐటీఈఎస్(కంప్యూటర్, బీపీవో, సాఫ్ట్‌స్కిల్స్) కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ రాష్ట్ర కో-ఆర్డినేటర్ నల్లపు శ్రవణ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి సదుపాయం ఉంటుందన్నారు. 18 నుంచి 35 ఏళ్లలోపు వయస్సు, పదోతరగతి, ఆపైనా అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 15వరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పదో తరగతి మెమో, ఆధార్‌కార్డు, సదరన్, కుల, ఆదాయ ధ్రువపత్రాలతో హైదరాబాద్‌లోని ట్రస్టు కార్యాలయంలో సంప్రదించాలన్నారు. పూర్తి సమాచారానికి 6364867804, 9010562803 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

మద్దిరాల, న్యూస్‌టుడే: మండలంలోని చందుపట్లలో సోమవారం నూతనకల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. కంటిచూపు లోపాలు ఉన్న రోగులకు ఆసుపత్రి సిబ్బంది పరీక్షలు నిర్వహించి మందులు, ఉచిత కళ్లద్దాలు పంపిణీ చేశారు. జిల్లా కేంద్రంలోని లయన్స్ కంటి ఆసుపత్రి ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే దోసపాటి గోపాల్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సుమారు 100 మంది పరీక్షలు నిర్వహించి 12 మంది రోగులకు ఆపరేషన్ చేసేందుకు ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఆసుపత్రి ఏవో పటేల్ నర్సింహారెడ్డి, జోన్ ఛైర్‌పర్సన్ దేవిరెడ్డి రవీందర్‌రెడ్డి, లయన్స్‌క్లబ్ మండలాధ్యక్షుడు ఏలేటి నారాయణరెడ్డి, కార్యదర్శి కృష్ణయ్య, కోశాధికారి నాగం సుధీర్‌రెడ్డి, క్లబ్ మండల అడ్మిన్‌స్ట్రేటర్ షేక్ మీరా, విజయ్‌రెడ్డి, లయన్స్ సభ్యులు పాల్గొన్నారు.



చందుపట్లలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దోసపాటి గోపాల్

ఆటల్లో అదుర్స్

గ్రామీణ ప్రాంతాల నుంచి క్రీడా పాఠశాలలకు ఎంపికై అక్కడ చక్కని ప్రతిభ కనబరుస్తూ విజేతలుగా సత్తా చాటుతున్నారు ఈ విద్యార్థులు.. చదువుతోపాటు వివిధ క్రీడాంశాల్లో తమకు అనువుగా ఉన్న ఆటను ఎంచుకుని సాధన చేసుకొని.. రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ప్రథమ స్థానాల్లో రాణిస్తూ తోటి మిత్రులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. – ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే

బాడ్మింటన్‌లో.. భరత్



మండలంలోని నెమ్మికల్‌కు చెందిన దాసరి సైదులు-లక్ష్మి దంపతుల కుమారుడు దాసరి భరత్‌కుమార్. కరీంనగర్ జిల్లా రుక్మాపూర్‌లోని సైనిక్ పాఠశాలలో ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. సైనిక్ పాఠశాల తరపున షటిల్ బాడ్మింటన్ పోటీల్లో పాల్గొని ప్రతిభను చాటుతున్నాడు. జగిత్యాలలో నిర్వహించిన అండర్-19 విభాగంలో 32జట్లు పాల్గొనగా తన జట్టు తరపున ఆడిన భరత్‌కుమార్ వరుసగా రెండు మ్యాచ్‌లు గెలిచి సెమీఫైనల్‌కు చేరుకున్నాడు. అనంతరం సెమీఫైనల్, ఫైనల్ మ్యాచ్‌ల్లోనూ గెలుపొంది బంగారు పతకం సాధించాడు. దీంతోపాటు రాష్ట్రస్థాయి బాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యాడు.

అథ్లెటిక్స్‌లో.. అనూష



మండల కేంద్రానికి చెందిన మేడి నాగయ్య-అలివేళ దంపతుల కుమార్తె మేడి అనూష. ఈమె ఆత్మకూర్(ఎస్) ప్రాథమిక పాఠశాలలో నాల్గో తరగతి చదువుతున్న సమయంలో మండలస్థాయి క్రీడా పోటీల్లో గెలుపొంది హైదరాబాద్ క్రీడా పాఠశాలకు ఎంపికయ్యారు. ప్రస్తుతం ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న అనూష పరుగుపందెం, లాంగ్‌జంప్‌లో ప్రథమ స్థానంలో నిలిచి బహుమతులను గెలుచుకుంది. రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్‌లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ కేటగిరిలో 60మీటర్ల పరుగుపందెంలో పాల్గొని ప్రథమ బహుమతి సాధించింది. నడిగూడెంలో నిర్వహించిన 100 మీటర్ల పరుగుపందెం పోటీల్లో అండర్-16విభాగంలో విజయం సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికైంది. జాతీయస్థాయి 600మీటర్ల పరుగు పందెంలో పాల్గొని చక్కని ప్రతిభ చూపింది. లాంగ్‌జంప్‌లోనూ వెండి బహుమతులు గెలుచుకుంది. హైదరాబాద్ ఉప్పల్ స్టేడియంలో నిర్వహించిన సబ్ జూనియర్ అండర్-16విభాగంలో లాంగ్‌జంప్‌లో రెండో స్థానంలో నిలిచి సిల్వర్ బహుమతిని అందుకుంది.

భానుపురి, న్యూస్‌టుడే:

? సూర్యాపేటలోని స్నేహనగర్‌లో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. నివారణ చర్యలు చేపట్టాలి. – మల్లయ్య, స్నేహనగర్

✔ దోమల మందు పిచికారీ చేయిస్తాం. – సారగండ్ల శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, సూర్యాపేట

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM to 1 PM) సూర్యాపేట: 9154395978 తుంగతుర్తి: 80085 74450

సూర్యాపేట పురపాలిక, న్యూస్‌టుడే:

? సూర్యాపేటలోని అంజనాపురి కాలనీలో రహదారులు లేవు. మట్టిరోడ్డు కావడంతో కాలనీవాసులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షానికి చిత్తడిగా మారాయి. వెంటనే సీసీగా నిర్మించాలి. – మధు, అంజనాపురి కాలనీ

✔ నిధుల లభ్యతను బట్టి సీసీగా మారుస్తాం. – శ్రీనివాస్, పుర కమిషనర్, సూర్యాపేట

పురస్కారానికి ఎంపిక.. అభినందనీయం

నూతనకల్, న్యూస్‌టుడే: అరుణోదయ నాగన్నకు ఈనెల 19న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సుద్దాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందించే జాతీయ పురస్కారానికి ఎంపిక కావడం అభినందనీయమని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంట నాగయ్య, తెలంగాణ సాంస్కృతిక సారథి జిల్లా ప్రధాన కార్యదర్శి గంట భిక్షపతి కొనియాడారు. నూతనకల్‌లో వారు సోమవారం ఆహ్వాన పత్రికలను విడుదల చేసి మాట్లాడారు. ప్రజా పాటై, గొంతుకై 50 ఏళ్లుగా పాటల ప్రస్థానంగా సాగిన నాగన్న సుద్దాల హనుమంతు-జానకమ్మ జాతీయ పురస్కారం అందుకోవడం శుభసూచకమన్నారు. పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గడ్డం శ్యామ్, దేసోజు మధు, మున్నా అశోక్, గడ్డం శ్రీను, గంట కార్తీక్, పులుసు రవి, గడ్డం యాదగిరి, తొట్ల రమేష్, వినయ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.


నూతనకల్‌లో ఆహ్వాన పత్రికలను విడుదల చేస్తున్న భిక్షపతి, నాగయ్య, తదితరులు

ఉపాధ్యాయ సమస్యలపై నిరంతర పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి

సూర్యాపేట(మహాత్మాగాంధీ రోడ్డు), న్యూస్‌టుడే: ఉపాధ్యాయ ఉద్యమం బలంగా ఉంటేనే సమస్యలు పరిష్కారమవుతాయని నల్గొండ-ఖమ్మం-వరంగల్ ఎమ్మెల్సీ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం జరిగిన టీఎస్ యూటీఎఫ్ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. శాసన మండలిలో క్రమం తప్పకుండా హాజరై ఉపాధ్యాయుల సమస్యలను ప్రస్తావించానని పేర్కొన్నారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై నిరంతర పోరాటం చేశానన్నారు. అంగన్‌వాడీల్లో ప్రాథమిక తరగతులు ప్రవేశపెట్టే విధానాన్ని వ్యతిరేకించానని గుర్తుచేశారు. యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్.రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్, యాకయ్య, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటయ్య, దామోదర్, నాగేశ్వర్‌రావు, రమేశ్, లాలు, పాండు రంగాచారి, సాంబయ్య, జనార్దన్ పాల్గొన్నారు.

అర్వపల్లిలో దగ్గరైన అప్పటి దోస్తాన్

జాజిరెడ్డిగూడెం: అర్వపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో 2012-13లో పదో తరగతి చదివిన విద్యార్థులు సోమవారం స్థానికంగా ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఆటా-పాటలతో అలరించారు. తమకు విద్య నేర్పిన గురువులు పాపయ్య, అబ్బయ్య, భాస్కర్, శ్రీధర్, యాదగిరి, కొమిరెల్లి, మంజుల, రాజకుమారి, సుమతి, కవిత, అంజలి, సంతోష్, సరితలను శాలువాలతో ఘనంగా సన్మానించారు.


అర్వపల్లిలో అప్పటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు


పాతసూర్యాపేట జడ్పీ ఉన్నత పాఠశాల 2005-06 బ్యాచ్ విద్యార్థులు

ఒక్కచోట కలిసిన పాతసూర్యాపేట విద్యార్థులు

ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: మండలంలోని పాతసూర్యాపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో 2005-06లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. నెమ్మికల్‌లోని ఎస్వీ ఫంక్షన్‌హాల్లో నిర్వహించిన ఈ సమ్మేళనంలో నాటి గురువులకు జ్ఞాపికలు అందించి ఘనంగా సత్కరించారు. నాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.

నూతన అధ్యక్షురాలిగా సులోచన

తుంగతుర్తి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని ఆదర్శ మహిళా సూపర్ బజారు నూతన అధ్యక్షురాలిగా తోట సులోచనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి డి.నారాయణస్వామి తెలిపారు. సోమవారం నిర్వహించిన ఎన్నికల్లో నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఎన్నుకున్నారన్నారు. ఉపాధ్యక్షురాలిగా జటంగి నాగమ్మ, డైరెక్టర్లుగా మల్లెపాక లక్ష్మి, ఎల్లబోయిన విజయలక్ష్మి, అంబటి రామతార, శంషుబీ, పెండెం సావిత్రమ్మలను నియమించారు. ఎన్నికల అధికారి బడేసాబ్, మేనేజరు అంబటి భిక్షం, మాజీ సర్పంచి స్వరూప, సిబ్బంది రాములు, శ్రీను పాల్గొన్నారు.

మహిళపై అత్యాచారయత్నం

ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: ఇంట్లో ఒంటరిగా ఉన్న మహిళపై అత్యాచారానికి యత్నించిన సంఘటన మండలంలోని ఓ గ్రామంలో జరిగింది. ఏఎస్ఐ శంకర్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. ఓ గ్రామానికి చెందిన పన్నాల సంతోష్‌రెడ్డి అనే వ్యక్తి ఈ నెల 12న రాత్రి అదే గ్రామంలో ఇంట్లో ఒంటరిగా ఉన్న ఓ మహిళపై అత్యాచారానికి యత్నించగా.. ఆమె కేకలు వేయటంతో చుట్టుపక్కలవారు నిద్రలేవడంతో నిందితుడు పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ సోమవారం తెలిపారు.

దాడికి పాల్పడ్డ వారిపై కేసు నమోదు

తుంగతుర్తి, న్యూస్‌టుడే: దేవీ శరన్నరాత్రి వేడుకలో భాగంగా మండలంలోని వెల్లుపల్లిలో జరిగిన ఘర్షణకు కారకులైన తొమ్మిది మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఏడు కొండలు తెలిపారు. గ్రామంలో ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహం వద్ద శనివారం రాత్రి మహిళలు కోలాటం వేస్తుండగా గ్రామానికి చెందిన పాలడుగు మహేశ్ ద్విచక్ర వాహనంపై అక్కడికి వచ్చి మహిళలకు ఆటంకం కల్గించాడన్నారు. అక్కడ ఘర్షణ వాతావరణం నెలకొని 100 కాల్ చేయగా సిబ్బందితో అక్కడకి వెళ్లి ఇరువర్గాలను శాంతి పరిచామన్నారు. అర్ధరాత్రి సుమారు ఒంటి గంట సమయంలో మహేశ్‌తోపాటు మరికొందరు చిత్తలూరి శ్రీధర్, రఘు ఇళ్లపైకి కర్రలతో వెళ్లి దాడి చేశారు. దాడిలో రఘు, ముఖేష్, రాము, అనిల్‌లకు గాయాలయ్యాయి. చిత్తలూరి శ్రీధర్ ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడ్డ పాలడుగు మహేష్, లోకేష్, బాబు, సైదులు, కిరణ్, వెంకటేష్, గణేశ్‌లతో పాటు మరికొందరిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చినుకు పడితే బురద.. దోమల బెడద

చిన్నపాటి వర్షాలకే ఎర్రపహాడ్‌లోని వీధులన్నీ బురదమయంగా మారుతున్నాయి. వచ్చి పోయే వాహనాలతో బురద మొత్తం ఇళ్లపైనే పడుతుందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటి గుంతలు ఏర్పడి దోమల వ్యాప్తి చెందుతున్నాయని, దుర్వాసన వస్తోందని, వ్యాధుల బారిన పడుతున్నామని వాపోయారు. దీనిపై ఎంపీడీవో సునీతను వివరణ కోరగా. . నిధులు మంజూరు కాగానే గ్రామాల్లోని వీధుల మరమ్మతులు మరమ్మతులు చేయిస్తామని, పారిశుధ్య కార్మికులతో దోమల వ్యాప్తి లేకుండా చూస్తామని పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, నూతనకల్ గ్రామీణం





తిరుమలగిరిలోని తెలంగాణ చౌరస్తాలో తిరుగుతున్న కుక్కలు

కుక్కల స్వైరవిహారం.. జంకుతున్న జనం

తిరుమలగిరి పురపాలికలో కుక్కల బెడద కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కాలనీల్లోనే కాకుండా ప్రధాన రహదారులపై తిరుగుతుండడంతో ద్విచక్రవాహనదారులు, చిన్నారులు భయపడుతున్నారు. పుర అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవటం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికే పలుచోట్ల కుక్కల దాడిలో గాయాలైన వారున్నారు. ఈ విషయమై ఇన్‌ఛార్జి పుర కమిషనర్ ఎం.బుచ్చిబాబును అడగగా.. నివారణకు స్వతంత్ర వెల్ఫేర్ ఏజెన్సీ వారితో మాట్లాడినట్లు, వారు జిల్లాకేంద్రంలోని ఏబీసీ కేంద్రానికి తీసుకెళ్లి వ్యాక్సిన్ చేసి కుటుంబ నియంత్రణ చికిత్స అందిస్తామని చెప్పినట్లు పేర్కొన్నారు. – తిరుమలగిరి, న్యూస్‌టుడే:

ఆకాశానికి పచ్చని పందిరి

ఇరువైపులా పెరిగిన చెట్ల కొమ్మలు కలిసిపోయి, ఆకాశానికి పందిరి వేసినట్లున్న ఈ చిత్రం మద్దిరాల మండలం గోరెంట్లలోనిది. ఆ గ్రామం నుంచి స్టేజీ వరకు వెళ్లే రహదారిలో నాలుగు కిలోమీటర్ల మేర ఎటు చూసినా పచ్చదనం పరచుకొని కనువిందు చేస్తోంది. ఈ రహదారి గుండా ప్రయాణిస్తుంటే అడవిలో మధ్యలోంచి వెళ్తున్నట్లు అనుభూతి కలుగుతోంది. ప్రయాణికులు ప్రకృతిని ఆస్వాదిస్తూ.. రాకపోకలు సాగిస్తున్నారు. – మద్దిరాల గ్రామీణం, న్యూస్‌టుడే:




సూర్యాపేట: బంగారు పతకాలు సాధించిన విద్యార్థులు

జాతీయస్థాయి చెస్ పోటీల్లో ప్రతిభ

సూర్యాపేట పట్టణం, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో ఈనెల 4 నుంచి 10 వరకు జరిగిన జాతీయస్థాయి చెస్ పోటీల్లో పట్టణానికి చెందిన విద్యార్థులు ప్రతిభ చూపారు. జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణ కల్యాణ మండపంలో శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులు జిల్లేపల్లి తనయ్, బామర్ లక్షిత్, జ్యోతుల రిషికృష్ణ, గడ్డం జైసాకేత్‌లు జాతీయస్థాయిలో బంగారు పతకాలు సాధించినట్లు శిక్షకుడు జిల్లేపల్లి జానయ్య సోమవారం తెలిపారు.

కళా ప్రదర్శన

జాజిరెడ్డిగూడెం, న్యూస్‌టుడే: ప్రకృతిని కాపాడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని తెలంగాణ సాంస్కృతిక సారథి జిల్లా అధ్యక్షుడు వెన్నెల నాగరాజు అన్నారు. కుంచమర్తి గ్రామంలో సోమవారం సారథి బృంద నాయకుడు ఈర్ల సైదులు ఆధ్వర్యంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై కళా ప్రదర్శన నిర్వహించారు. గంజాయి నియంత్రణ, మాదకద్రవ్యాల నిషేధంపై ప్రజలకు ఆటా-పాటలతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాగి శంకర్, ఉదయ్, మేడిపల్లి వేణు, శిరీష, స్రవంతి, రాధ, మంజుల, ఉపేందర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.



కుంచమర్తిలో పాటలు పాడుతూ అవగాహన కల్పిస్తున్న కళాకారుల బృందం

'సాయిబాబా మరణం ప్రభుత్వ హత్యే'


సూర్యాపేట: ప్రొ.సాయిబాబా చిత్రపటానికి కొవ్వొత్తులతో నివాళి అర్పిస్తున్న ప్రజా సంఘాల ఐక్య వేదిక వక్తలు

సూర్యాపేట(మహాత్మాగాంధీ రోడ్డు): చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడనంత వరకు అరెస్ట్ చేసే అధికారం ఎవరికీ లేదని ప్రజా సంఘాల ఐక్య వేదిక వక్తలు పేర్కొన్నారు. ప్రజాసంఘాల ఐక్య వేదిక, సూర్యాపేట సామాజిక అధ్యయన వేదిక, డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం ప్రొఫెసర్ సాయిబాబా చిత్రపటానికి కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వాన్ని కూలదోచే కుట్ర చేశాడనే అనుమానంపై పదేళ్లపాటు జైలులోనే ఉంచి, సాక్షాలు నిరూపించలేక చివరికి విడుదల చేసినట్లు తెలిపారు. ముమ్మాటికి సాయిబాబా మరణం భాజపా ప్రభుత్వ హత్యేనని ఆరోపించారు.

ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

నూతనకల్, న్యూస్‌టుడే: ప్రైవేట్ ఎలక్ట్రికల్ టెక్నీషియన్ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలని ప్రైవేట్ ఎలక్ట్రికల్ టెక్నీషియన్స్ ఫెడరేషన్(టీపీఈటీఎఫ్) జిల్లా అధ్యక్షుడు తోట శ్రవణ్‌కుమార్ కోరారు. నూతనకల్ తహసీల్దార్ శ్రీనివాస్‌రావుకు సోమవారం ఆ సంఘం సభ్యులతో కలిసి వినతిపత్రం అందించి మాట్లాడారు. ప్రతిఒక్కరు లేబర్ కార్డులు తీసుకొని సంక్షేమ ఫలాలను పొందాలని సూచించారు. ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ జాని పాష, గౌరవ సలహాదారులు రాగి బ్రహ్మచారి, మండల అధ్యక్షుడు మైదం జానయ్య, ఉపాధ్యక్షుడు సంద వెంకన్న, సహాయ కార్యదర్శి బూడిద సైదులు, మధు, దిలీప్, శంకర్, జావీద్, సత్తిరెడ్డి తదితరులున్నారు.


నూతనకల్‌లో తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న శ్రవణ్‌కుమార్, తదితరులు

కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొడదాం: ఐఎఫ్‌టీయూ

చివ్వెంల, న్యూస్‌టుడే: ప్రపంచ వ్యాప్తంగా కార్మికవర్గంపై దాడి తీవ్రతరం అవుతుందని, ఆయా దేశాల ఆర్థిక సంక్షోభ పర్యవసనాలు శ్రమశక్తులపైనే తమ ప్రతాపం చూపిస్తున్నాయని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్‌కే.సయ్యద్‌హుస్సేన్ పేర్కొన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రం సమీపంలోని కుడకుడ లెనిన్‌నగర్‌లో ఈనెల 20న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే టీయూసీఐలో ఐఎఫ్‌టీయూ విలీన సభ గోడపత్రికను సోమవారం ఆవిష్కరించి మాట్లాడారు. దేశంలో కార్మికవర్గంపై ప్రభుత్వం, కంపెనీల యాజమాన్యాల దోపిడీ నిరంతరం జరుగుతుందని ఆరోపించారు. కార్మికుల ఐక్యతకు, సమష్టి ఉద్యమానికి ఈ విలీన సభ ఉపయోగపడుతుందన్నారు. అంజయ్య, హుస్సేన్, రాములు, మోహన్, ఉపేందర్, ప్రసాద్, నారాయణ, రమేష్, జలేందర్, సైదులు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.


చివ్వెంల: టీయూసీఐలో ఐఎఫ్‌టీయూ విలీన గోడపత్రికను ఆవిష్కరిస్తున్న నాయకులు

7న ఓంకార్ వర్ధంతి సభ

కుడకుడరోడ్డు(సూర్యాపేట), న్యూస్‌టుడే: నర్సింపేట మండలం మచ్చాపురంలో ఈనెల 17న ఎంసీపీఐ(యూ) ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన మద్దికాయల ఓంకార్ వర్ధంతి సభను జయప్రదం చేయాలని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వరికుప్పల వెంకన్న పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని బీఎన్‌రెడ్డి విగ్రహం వద్ద సోమవారం కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ.. భూమి, భుక్తి, విముక్తి కోసం అలుపెరగని పోరాటం చేసిన గొప్ప నాయకుడని ఆయన సేవలను కొనియాడారు. సభకు ప్రజలు, ప్రజాతంత్ర వాదులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. జిల్లా కార్యదర్శి షేక్ నజీర్, ఏపూరి సోమన్న, ఉగ్రయ్య, వైభవ్, శబరి, సత్యనారాయణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


సూర్యాపేటలోని బీఎన్‌రెడ్డి విగ్రహం వద్ద కరపత్రాలను విడుదల చేస్తున్న ఎంసీపీఐ(యూ) నాయకులు

కబడ్డీ పోటీల బహుమతులు ప్రదానం

తుంగతుర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: రావులపల్లి ఎక్స్‌రోడ్డు తండాలో దసరా వేడుకలను పురస్కరించుకొని గుగులోత్ రామకృష్ణ, రాజశేఖర్ సహకారంతో మండలస్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించారు. రెండ్రోజులపాటు జరిగిన ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు నిర్వాహకులు సోమవారం బహుమతులు అందజేశారు. సికిందర్, వెంకటేష్, అర్జున్, సుధాకర్, రాజశేఖర్, ఓమన్న, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి సాయం

పెన్‌పహాడ్, న్యూస్‌టుడే: మండలంలోని దోసపహాడ్ గ్రామానికి చెందిన సద్దల తిరుపతి అనారోగ్యంతో ఇటీవల మృతిచెందారు. మృతుడి స్నేహితులు ఎన్.అన్నారం జడ్పీ ఉన్నత పాఠశాలలో 1995-96లో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు రూ.36 వేలు నగదు, 50కిలోల బియ్యం బాధిత కుటుంబానికి అందజేశారు. చెరుకుపల్లి వెంకన్న, యగ్గడి నాగయ్య, మేడం వెంకన్న, ఎ.నగేష్, ఉపేందర్ రెడ్డి, కృష్ణయ్య తదితరులున్నారు.

చర్యలు తీసుకోవాలని వినతి

సూర్యాపేట పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని కుడకుడలో నివసిస్తున్న పేదల ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇవ్వాలని, తమపై తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ మాట్లాడుతూ.. అర్హులైన పేదలకు వెంటనే ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఎర్ర అఖిల్, హుస్సేన్, లింగయ్య, జయమ్మ, సంతోషి, పద్మ, గోరమ్మ పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ ధరలు

భానుపురి, న్యూస్‌టుడే: సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌కు సోమవారం వచ్చిన వివిధ పంట ఉత్పత్తులకు పలికిన గరిష్ఠ, కనిష్ఠ ధరల వివరాలు(రూపాయల్లో).

రకం	గరిష్ఠం	కనిష్ఠం
బీపీటీ	2929	2513
జైశ్రీరాం	2949	2092
ఐఆర్-64	1979	1786
హెచ్ఎంటీ	2609	1776
కందులు	6395	4136
పెసర	5189	5109
మొక్క జొన్న	1813	1573
ఆముదం	5121	5121

శివాలయ నిర్మాణానికి శాంతిపూజ


సూర్యాపేట: ప్రత్యేక అలంకరణలో అన్నపూర్ణ సహిత విశ్వనాథస్వామి

తిరుమలగిరి, న్యూస్‌టుడే: తాటిపాములలో శిథిలావస్థలో ఉన్న పురాతనమైన రామాలయం ప్రాంతంలో నూతనంగా శివాలయాన్ని నిర్మించేందుకు సోమవారం శాంతి పూజ, హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని క్రతువును తిలకించి పూజలు చేశారు. త్వరలో ఆలయ పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు పాల్గొన్నారు.

విశ్వనాథుడికి అభిషేకాలు.. సూర్యాపేట సాంస్కృతికం: సూర్యాపేట జిల్లా కేంద్రంలోని అన్నపూర్ణ సహిత విశ్వనాథస్వామి ఆలయంలో స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలను అర్చకుడు వలివేటి వీరభద్రశర్మ నిర్వహించారు. ఆలయంలో ఉదయం స్వామివారిని మేల్కొలిపి అర్చన అష్టోత్తర శతనామార్చనలు శాస్త్రోక్తంగా జరిపారు. సోమవారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.


తాటిపాములలో హోమం నిర్వహిస్తున్న పురోహితులు

సీతారామచంద్రస్వామికి పల్లకీ సేవ.. నాగారం: ఫణిగిరిలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయంలో దసరా పండగను పురస్కరించుకొని ఆదివారం రాత్రి పల్లకీసేవ నిర్వహించారు. దేవతామూర్తులను గ్రామంలోని వీధుల గుండా అంగరంగ వైభవంగా ఊరేగించి.. నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు కూరేశం సంతోష్ ఆచార్యులు, ఆలయ కమిటీ ఛైర్మన్ గట్టు లక్ష్మీకాంత్, భక్తులు పాల్గొన్నారు.